News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :176 | ఖమ్మం | ఆదివారం, ఆగస్టు 10, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టుల్లో 80 వేల కోట్ల పెట్టుబడులు



## సీఎం రేవంత్‌రెడ్డితో ఎన్టీపీసీ ప్రతినిధి బృందం భేటీ

పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి రంగంలో ఇన్వెస్ట్‌మెంట్లకు సుముఖం

రాష్ట్రంలో 6,700 మెగావాట్ల సామర్థ్యానికి అవకాశం

అన్ని విధాలా సహకరిస్తామన్న ముఖ్యమంత్రి

హైదరాబాద్: తెలంగాణలో రూ.80వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) సంసిద్ధత వ్యక్తం చేసింది. ఎన్టీపీసీ సీఎండీ గురుదీప్ సింగ్ బృందం శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసింది. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి రంగంలో పెట్టుబడులు పెట్టనున్నట్లు వివరించింది. సోలార్, పవన విద్యుత్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు ఎన్టీపీసీ సుముఖత తెలిపింది. రాష్ట్రంలో 6,700 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ఉత్పత్తికి అవకాశం ఉందని సీఎంకు ఎన్టీపీసీ బృందం తెలిపింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అన్ని విధాలా సహకరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

## త్వరలో ఏఐ విశ్వవిద్యాలయం ఏర్పాటు



మానవ జీవితం, పరిపాలనపై కృత్రిమమేధ(ఏఐ) సాంకేతికత అధిక ప్రభావం చూపుతున్న నేపథ్యంలో విద్యార్థులు, వృత్తి నిపుణుల కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కోర్సులను అందించే ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. రాయదుర్గంలోని

వివరాలు 2లో..

## అన్ని ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్లాంట్లు

కలెక్టర్లకు ఉప ముఖ్యమంత్రి భట్టి ఆదేశం



గ్రామ పంచాయతీ కార్యాలయం మొదలుకొని సచివాలయం వరకు అన్ని ప్రభుత్వ భవనాలపైనా సౌరవిద్యుత్ (సోలార్ పవర్) ప్లాంట్లు ఏర్పాటు చేయాలని

వివరాలు 2లో..



## క్విట్ భాజపా అంటేనే దేశానికి భవిష్యత్తు

స్వాతంత్ర్య పోరాటంలో క్విట్ ఇండియా ఉద్యమం కీలకమైందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా గాంధీభవన్‌లో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డూ ఆర్ డై నినాదంతో గాంధీ క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభించారన్నారు. కాంగ్రెస్ చరిత్రను తుడిచేయాలని భాజపా చూస్తోందని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తోందన్నారు. రాజ్యాంగ సంస్థలతో ప్రతిపక్షాలపై కుట్రపూరిత దాడి చేస్తున్నారని దుయ్యబట్టారు. "ఎన్నికల కమిషన్ భాజపాకు అనుబంధ సంస్థగా

వివరాలు 2లో..



## సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీలు కట్టిన మహిళా మంత్రులు

రక్షాబంధన్ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మహిళా మంత్రులు రాఖీలు కట్టారు. మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పార్టీ నేతలు తదితరులు సీఎంకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తదితరులకు మంత్రి సీతక్క రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు.

వివరాలు 2లో..

## మా కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు రజనీకాంత్ గారు అండగా నిలిచారు

- సినిమాల్లో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సూపర్ స్టార్ రజనీకాంత్
- రజనీకాంత్‌పై ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రశంసలు
- 'కూలీ' సినిమాకు శుభాకాంక్షలు తెలుపుతూ ట్వీట్
- రజనీకాంత్‌పై ప్రత్యేకంగా ఎడిట్ చేసిన వీడియో షేర్



:సూపర్ స్టార్ రజనీకాంత్‌పై ఆంధ్రప్రదేశ్ ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రజనీకాంత్ సినీ ప్రస్థానంలో 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ, తమ కుటుంబానికి కష్టకాలంలో ఆయన అందించిన మద్దతును గుర్తుచేసుకున్నారు. ఈ మేరకు లోకేశ్ సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ చేశారు. "రజనీకాంత్ శకంలో మనం జీవించడం అదృష్టం.

వివరాలు 2లో..

## హైదరాబాద్ లో మళ్లీ వాన



- శనివారం రాత్రి హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం
- విజయవాడ హైవేపై నిలిచిన వరద నీటితో భారీగా ట్రాఫిక్ జామ్
- ఎల్బీనగర్, ఉప్పల్, హయత్‌నగర్ సహా పలు ప్రాంతాల్లో కుండపోత
- రంగారెడ్డి జిల్లా తొర్రూరులో అత్యధికంగా 116.5 మి.మీ. వర్షపాతం
- సైదాబాద్ రెడ్డి కాలనీ నీట మునక, స్థానికుల ఇక్కట్లు
- నగరంలోని అనేక రోడ్లు జలమయం, జనజీవనం అస్తవ్యస్తం

భాగ్యనగరాన్ని శనివారం రాత్రి కూడా భారీ వర్షం ముంచెత్తింది. ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వాన కారణంగా నగరం అస్తవ్యస్తమైంది. ముఖ్యంగా హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. పెద్ద అంబర్‌పేట్ నుంచి ఎల్బీనగర్ మీదుగా నగరంలోకి వచ్చే మార్గాల్లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. శనివారం సాయంత్రం నుంచి నగరంలోని పలు ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, వనస్థలిపురం, నాగోల్, ఉప్పల్, ఎల్బీనగర్, బీఎన్ రెడ్డి నగర్ వంటి శివారు ప్రాంతాల్లో అతి భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నాదర్‌గుల్‌లో 80 మి.మీ., హయత్‌నగర్‌లో 75 మి.మీ. చొప్పున వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. ఈ భారీ వర్షానికి సైదాబాద్‌లోని రెడ్డి కాలనీ పూర్తిగా నీట మునిగింది. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో

వివరాలు 2లో..



వివరాలు 2లో..

## రాజకీయాలు వద్దనుకుంటున్నా

మల్లారెడ్డి సంచలన వ్యాఖ్యలు

- తనకు 73 సంవత్సరాలు వచ్చాయన్న మల్లారెడ్డి
- వచ్చే ఎన్నికల నాటికి రాజకీయాల నుంచి తప్పుకునే ఆలోచనలో ఉన్నానని వెల్లడి
- ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో ఉన్నానన్న మల్లారెడ్డి
- ఇక ఏవైపు చూడాల్సిన అవసరం లేదని స్పష్టీకరణ

## రాఖీ పండుగ అంటే కేవలం ఒక దారం కాదు



- రాఖీ పండుగ శు భాకాంక్షలు తెలిపిన పవన్ కల్యాణ్
- రాఖీ అంటే అనుబంధాల భావోద్వేగాలకు సంకేతమన్న డిప్యూటీ సీఎం
- ఆడపడుచులకు ఎప్పుడూ అండగా ఉంటానని హామీ

వివరాలు 2లో..

# అన్ని ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్లాంట్లు

- మొదటి పేజీ తరువాయి

అన్ని జిల్లాల కలెక్టర్లను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. రాష్ట్రంలో సౌరవిద్యుత్‌ను పెద్దఎత్తున ఉత్పత్తి చేయాలని మంత్రివర్గం విధాన నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, గిరిజనుల భూముల్లో 'ఇందిరా సౌరగిరి జలవికాసం' పథకం అమలుపై జిల్లా కలెక్టర్లతో శనివారం సచివాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, విద్యుత్‌శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్ తదితరులు పాల్గొన్నారు. భట్టి మాట్లాడుతూ... "అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాలు, పార్కింగ్, క్యాంటీన్ ప్లాన్లను హైదరాబాద్‌కు పంపాలి. కలెక్టరేట్లు అన్నీ ఒకే నమూనాలో నిర్మించినందున వాటిపై సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన డిజైన్లు హైదరాబాద్ నుంచి పంపిస్తాం. భవనాలపై సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు కలెక్టర్లు ప్రభుత్వానికి పంపాల్సిన వివరాలకు సంబంధించి ఒక ప్రశ్నావళిని పంపిస్తున్నాం. అందులో అన్ని వివరాలు నమోదుచేసి వారంలోగా విద్యుత్‌శాఖకు పంపించాలి. నీటిపారుదల, రోడ్లు-భవనాల శాఖల పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల వివరాలు పంపాలి. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్ఓఎఫ్ఆర్ చట్టం కింద 6.70 లక్షల ఎకరాల భూములను గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేసింది. ఈ భూముల్లో 'ఇందిరా సౌరగిరి జలవికాసం' కింద వ్యవసాయ బోర్లకు ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయాలి. ఇప్పటికే అచ్చంపేట నియోజకవర్గంలో ఈ పథకం ప్రారంభించాం. ఈ నెలలోనే ఆదిలాబాద్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రారంభించే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఈ పథకానికి సంబంధించిన వివరాలను కలెక్టర్లు వారంలోగా పంపాలి" అని ఆదేశించారు.

**రాజకీయాల్లో యువత ప్రధాన పాత్ర పోషించాలి**

హైదరాబాద్, న్యూస్‌టుడే: రాజకీయాల్లో యువత ప్రధాన పాత్ర పోషించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. శనివారం గాంధీభవన్ ఆవరణలో జరిగిన క్విట్ ఇండియా దినోత్సవం, యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ యువతను ప్రోత్సహిస్తున్నారు. వారు రాజకీయాల్లో చురుకుగా పాల్గొనాల్సిన అవసరం ఉంది. చావోరేవో తేల్చుకునే నినాదంతో మహాత్మా గాంధీ చేపట్టిన క్విట్ ఇండియా ఉద్యమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఆంగ్లేయులు వేల మందిని జైళ్లలో పెట్టి చిత్రహింసలకు గురిచేశారు. అయినా మొక్కవోని ధైర్యంతో ఉద్యమం ఉవ్వెత్తున లేచి బ్రిటిష్ వారిని తోకముడిచేలా చేసింది. కానీ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొద్దిరోజుల్లోనే గాంధీ ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. సీఎం రేవంత్‌రెడ్డి గిరిజనుల బాగు కోసం 'ఆత్మీయ ఇందిర సౌర గిరి వికాస పథకం' ప్రవేశపెట్టారు' అని భట్టి పేర్కొన్నారు.

# రక్షాబంధన్... ట్రాఫిక్ చక్రబంధం

- మొదటి పేజీ తరువాయి

వరకూ నిలిచిపోయాయి. ట్రాఫిక్‌ని చక్కదిద్దేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

రాష్ట్రంలోని ఆర్టీసీ బస్టాండ్లు ప్రయాణికుల రద్దీతో కిటకిటలాడాయి. వచ్చిన బస్సులు వచ్చినట్లే నిండిపోయాయి. గురువారం నుంచే ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపిస్తోంది. శనివారం వరకు మూడు రోజుల్లో 2,600 ప్రత్యేక బస్సులు నడిపించినట్లు ఆర్టీసీ ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'కు తెలిపారు. సోమవారం వరకు అవసరమైన మేరకు ప్రత్యేక బస్సులు నడిపిస్తామని పేర్కొన్నారు.

పండగ రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక బస్సుల్లో ఛార్జీల్ని ఆర్టీసీ 50 శాతం వరకు పెంచింది. 2003 నాటి జీఓ 16 ఆధారంగా ప్రత్యేక బస్సుల ఛార్జీలను 50 శాతం వరకు 11వ తేదీ వరకు పెంచినట్లు ఆర్టీసీ యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. ఉప్పల్ నుంచి హనుమకొండకు సాధారణ రోజుల్లో సూపర్ లగ్జరీ బస్సు ఛార్జీ రూ.340 ఉండగా.. శనివారం స్పెషల్ పేరుతో రూ.440 వసూలు చేసింది. రాజధాని ఏసీ బస్సు ఛార్జీ సాధారణ రోజుల్లో రూ.390 కాగా.. శనివారం రూ.550కి పెరిగింది. మిగతా రోజుల్లో ఏసీ బస్సు ఛార్జీ కంటే తాజాగా పెంచిన నాన్ ఏసీ బస్సు ఛార్జీ రూ.50 ఎక్కువగా ఉండటం గమనార్హం. అదనపు ఛార్జీలతో పాటు బస్సులు ఖాళీ లేక, సీట్లు దొరక్క ప్రయాణికులు వ్యయప్రయాసలకు గురయ్యారు. అనేక రూట్లలో రెగ్యులర్ బస్సులను కూడా 'స్పెషల్' పేరుతో నడిపించిందని పలువురు తెలిపారు.

'మహాలక్ష్మి' పథకంతో ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో సగటు ఓఆర్ (సీట్ల భర్తీ నిష్పత్తి) 94 శాతానికి చేరింది. శుక్రవారం 57.52 లక్షల మంది ప్రయాణించగా... ఓఆర్ 99% నమోదైంది. శనివారం 120 శాతానికి చేరుకుంటుందని అధికారుల అంచనా.

**మెట్రో కిటకిట..**

మెట్రో రైళ్లలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ప్రయాణికులు కిక్కిరిసి ప్రయాణించారు. ఎల్బీనగర్-మియాపూర్,
నాగోల్-రాయదుర్గం మార్గాల్లో ఎక్కువ రద్దీ కనిపించింది. గంటల తరబడి ఎదురుచూసినా బస్సులు రాకపోవడం.. వచ్చినా నిండిపోయి ఉండటంతో ప్రయాణికులు మెట్రోను ఆశ్రయించారు. దాదాపుగా 5 లక్షల మంది మెట్రోలో రాకపోకలు సాగించి ఉంటారని అంచనా.

# మా కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు రజనీకాంత్ గారు అండగా నిలిచారు

- మొదటి పేజీ తరువాయి

ఆయన చిత్ర పరిశ్రమలో 50 ఏళ్లు పూర్తి చేసుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చే విషయం" అని లోకేశ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇదే సమయంలో ఆయన తమ కుటుంబంతో రజనీకి ఉన్న అనుబంధాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. "మా కుటుంబం అత్యంత కష్ట కాలంలో ఉన్నప్పుడు రజనీకాంత్ గారు మాకు అందించిన అచంచలమైన మద్దతును ఎప్పటికీ మర్చిపోలేను" అని లోకేశ్ భావోద్వేగంగా తెలిపారు. ఈ సందర్భంగా రజనీకాంత్ నటిస్తున్న 'కూలీ' చిత్ర బృందానికి విజయం చేకూరాలని ఆకాంక్షించారు. అంతేకాదు, స్పెషల్ గా ఎడిట్ చేసిన రజనీకాంత్ పవర్ హౌస్ వీడియోను కూడా లోకేశ్ పంచుకున్నారు.

# నాపై దాడి జరిగితే నారా లోకేశ్, బీటెక్ రవి బాధ్యత వహించాలి: పులివెందుల వైసీపీ నేత సతీశ్ రెడ్డి



వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పులివెందుల నేత సతీశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై దాడి జరిగే అవకాశం ఉందని... ఈ విషయాన్ని టీడీపీ నేతలే తనతో చెప్పారని ఆయన తెలిపారు. తనకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులదేనని చెప్పారు. తనపై దాడి జరిగితే దానికి మంత్రి నారా లోకేశ్, పులివెందుల టీడీపీ ఇన్చార్జ్ బీటెక్ రవి బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. తనపై దాడి జరిగితే కోర్టులు సుమోటోగా స్వీకరించాలని కోరారు. ఇక్కడి పోలీసులతో తనకు న్యాయం జరగదని... తనపై దాడి జరిగితే సీబీఐతో విచారణ జరిపించాలని అన్నారు. ఏపీ పోలీసులు పచ్చ చొక్కాలు వేసుకున్నారని విమర్శించారు. జడ్పీటీసీ ఉప ఎన్నిక నేపథ్యంలో పులివెందులలో జరుగుతున్న వ్యవహారాలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయని చెప్పారు. టీడీపీ, పోలీసులు వ్యవహరిస్తున్న తీరుతో ప్రజాస్వామ్య వ్యవస్థలపై నమ్మకం పోతోందని అన్నారు. టీడీపీ వాళ్లే దాడి చేసి, ఆ నెపాన్ని తమపై మోపడం రివాజుగా మారిందని సతీశ్ రెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వం, పోలీసుల అరాచకాలు తట్టుకోలేక ఉప ఎన్నికను వదిలిపెడతామని అనుకుంటున్నారేమో... తమ పార్టీ మహిళలే ఎన్నికలను ముందుండి నడిపిస్తారని చెప్పారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికను గెలిచి తన తండ్రి చంద్రబాబుకు గిఫ్ట్ గా ఇవ్వాలని నారా లోకేశ్ అనుకుంటున్నారని సతీశ్ రెడ్డి అన్నారు. లోకేశ్ మీరు అనుచితంగా మాట్లాడితే... మేము కూడా అలానే మాట్లాడతామని చెప్పారు. ఈ ఉప ఎన్నిక పులివెందుల పౌరుషానికి, లోకేశ్ రెడ్ బుక్ అహంకారానికి మధ్య పోరు అని అన్నారు.

# వేతనాల పెంపు: నిర్మాతల ప్రతిపాదనలకు నో చెప్పిన ఫిల్మ్ ఫెడరేషన్

తెలుగు సినీ పరిశ్రమలో కార్మికుల వేతనాల పెంపు విషయమై నిర్మాతలు, ఫిల్మ్ ఫెడరేషన్ నేతల మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. షరతులతో కూడిన వేతనాల పెంపు ప్రతిపాదనలను నిర్మాతలు ముందుకు తెచ్చినప్పటికీ, వాటిని అంగీకరించేది లేదని ఫెడరేషన్ నేతలు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం నుంచి తమ ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని ఫెడరేషన్ ప్రకటించింది.

శనివారం హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో నిర్మాతలు తమ నిర్ణయాన్ని వెల్లడించారు. ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి దామోదర ప్రసాద్ మాట్లాడుతూ, మూడు విడతల్లో వేతనాలు పెంచేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలిపారు. రోజుకు రూ.2 వేల కంటే తక్కువ తీసుకునే కార్మికులకు మొదటి ఏడాది 15 శాతం, రెండో ఏడాది 5 శాతం, మూడో ఏడాది 5 శాతం పెంపు ఇస్తామని, రూ.1000 కంటే తక్కువ వేతనం ఉన్నవారికి వెంటనే 20 శాతం పెంచి, మూడో ఏడాది మరో 5 శాతం పెంచుతామని చెప్పారు. అయితే, చిన్న బడ్జెట్ సినిమాలకు పాత వేతనాలే కొనసాగుతాయని, నాలుగు షరతులకు ఒప్పుకుంటేనే ఈ పెంపు అమలవుతుందని నిర్మాతలు తెలిపారు.

అయితే, నిర్మాతల షరతులు ఫెడరేషన్‌ను విభజించేలా, యూనియన్ల ఐక్యతను దెబ్బతీసేలా
ఉన్నాయని ఫెడరేషన్ నేతలు ఆరోపించారు. 13 సంఘాలకు చెందిన రోజువారీ కార్మికులందరికీ ఒకే విధమైన వేతన పెంపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిర్మాతల ప్రతిపాదనలను తిరస్కరిస్తూ, తమ ఆందోళనను ఆదివారం నుంచి మరింత తీవ్రతరం చేయనున్నట్లు ఫెడరేషన్ నేతలు ప్రకటించారు.

# క్విట్ భాజపా అంటేనే దేశానికి భవిష్యత్తు

- మొదటి పేజీ తరువాయి

మారింది. ప్రశ్నిస్తే దేశద్రోహులని ముద్ర వేస్తున్నారు. క్విట్ భాజపా అంటేనే దేశానికి భవిష్యత్తు. కాంగ్రెస్ పార్టీ దేశ రక్షణ కోసం పనిచేస్తోంది. భాజపా.. కులాలు, మతాల పేరిట భవిష్యత్తు లేకుండా చేస్తోంది. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక్క భాజపా, ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు లేడు" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

# రాజకీయాలు వద్దనుకుంటున్నా: మల్లారెడ్డి సంచలన వ్యాఖ్యలు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను బీజేపీ వైపా, టీడీపీ వైపా, బీఆర్ఎస్ వైపా అనేది కాదని... ప్రస్తుతం తాను బీఆర్ఎస్ పార్టీలో ఉన్నానని... వచ్చే ఎన్నికల నాటికి రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకునే ఆలోచనలో ఉన్నానని చెప్పారు. తనకు 73 సంవత్సరాలు వచ్చాయని... ఈ వయసులో ఏవైపూ చూడాల్సిన అవసరం లేదని అన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రి అయ్యానని... ఇంకా మూడేళ్లు రాజకీయాల్లో ఉంటానని చెప్పారు. ఆ తర్వాత రాజకీయం వద్దనుకుంటున్నానని... ప్రజలకు సేవ చేస్తూ కాలేజీలు, యూనివర్శిటీలు నడిపిద్దామనుకుంటున్నానని తెలిపారు. హైదరాబాద్ లోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

# హైదరాబాద్ లో మళ్లీ వాన

- మొదటి పేజీ తరువాయి

స్థానికులు బయటకు రాలేక తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. భాగ్యలత వద్ద కూడా రోడ్డుపై నీరు నిలవడంతో వాహనాలు నత్తనడకన కదిలాయి.

నగరంలోని సికింద్రాబాద్, తార్నాక, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, మియాపూర్, గచ్చిబౌలి, మెహిదీపట్నం, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కోఠి, అబిడ్స్ సహా దాదాపు అన్ని ప్రధాన ప్రాంతాల్లో వర్షం ప్రభావం చూపింది. రోడ్లన్నీ చెరువులను తలపించడంతో
అనేక చోట్ల జనజీవనం స్తంభించింది. సమాచారం అందుకున్న అధికారులు, సహాయక చర్యలు చేపట్టి, వరద నీటిని తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు.

# త్వరలో ఏఐ విశ్వవిద్యాలయం ఏర్పాటు

- మొదటి పేజీ తరువాయి

హైదరా బాద్ నాలెడ్జ్ సిటీలో ఏర్పాటుచేసిన ఈయాప్‌సిస్ సంస్థ గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్(జీఐసీ)ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా హైదరాబాద్ తయారవుతోందన్నారు. కంపెనీలు యూనికార్న్ స్థాయిని సాధించే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గతంలో హైదరాబాద్‌లో మూడు యూనికార్న్‌లు ఉండేవని, ఇప్పుడు 30-40 వరకు పెరిగాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని పెరుగుతాయన్న ఆశాభావం వ్యక్తంచేశారు. సంస్థ ఛైర్మన్ ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ... తమ సంస్థ కెనడాలోని గ్లోబల్ ఒరాకిల్‌తో కలిసి ప్రస్తుతమున్న 200 మంది సిబ్బందిని వచ్చే రెండేళ్లలో 500 మందికిపైగా పెంచాలని ప్రణాళికలు రూపొందించిందన్నారు. ఇందులో భాగంగా అత్యాధునిక 400 సీట్ల సామర్థ్యంతో కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కె.రాజేశ్‌రెడ్డి, టీజీటీఎస్ ఛైర్మన్ మన్నె సతీశ్‌కుమార్, సంస్థ డైరెక్టర్ సృజని, కాంగ్రెస్ నేత జగదీశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ పై తడిబట్టలతో ప్రమాణం చేస్త

- మొదటి పేజీ తరువాయి

హైకోర్టు జడ్జీలు, భార్యభర్తల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలని కోరారు. మాజీ మంత్రి కేటీఆర్ ఏ గుడికి, ఎప్పుడు రమ్మంటారో చెబితే తాను భార్యా పిల్లలతో వస్తానని సవాలు విసిరారు. 'మా గుడులపై నమ్మకం లేకుంటే మీరు ఏదైనా మసీదు, చర్చి పేరు చెప్పినా ఫరవాలేదు.. కేటీఆర్, కేసీఆర్ కుటుంబంతో రావాలె..' అని అన్నారు.

నాతో పాటు సీఎం రేవంత్ రెడ్డి ఫోన్ కూడా ట్యాపింగ్ చేశారు. కేటీఆర్ నా ఫోన్ ట్యాపింగ్ చేయించారని నాకు తెలుసు. మావోయిస్టు సానుభూతిపరులుగా మా నంబర్లను పోలీసులకు ఇచ్చారని అన్నారు. మా ఫోన్లే కాదు బీఆర్ఎస్ మంత్రులు, లీడర్లు, ఎమ్మెల్యేలు, వ్యాపారస్తులు, సినీ ప్రముఖుల ఫోన్లు ట్యాప్ అయ్యాయని, బీఆర్ఎస్ నాయకులకు సిగ్గుంటే ఆ పార్టీ నుంచి బయటికి రావాలని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ తో కేటీఆర్.. వ్యాపారస్తులను బ్లాక్ మెయిల్ చేసి భారీగా డబ్బులు దండుకున్నారని ఆరోపించారు. హైకోర్టు జడ్జీలు, భార్యభర్తల ఫోన్లు కూడా ట్యాపింగ్ చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలని కోరారు. కేసీఆర్ కు వేల కోట్ల రూపాయలు ఎక్కడినుంచి వచ్చాయి.. ఫోన్ ట్యాపింగ్ తో బ్లాక్ మెయిల్ చేసిన సంపాదించారని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల సమయంలో కేసీఆర్ మమత బెనర్జీకి ఎన్నికల ఫండ్ ఇచ్చారని అన్నారు. అంతే కాదు మహారాష్ట్ర ఎన్నికల సమయంలో కూడా కేసీఆర్ ముంబై వెళ్లి ఎన్నికల ఫండ్ ఇచ్చింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు బండి సంజయ్.

# రాఖీ పండుగ అంటే కేవలం ఒక దారం కాదు

రాఖీ పండుగ సందర్భంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. అక్కచెల్లెళ్లకు, అన్నదమ్ములకు మధ్య అనుబంధాన్ని చూపే వేడుక రాఖీ పౌర్ణమి అని ఆయన చెప్పారు. రాఖీ అంటే కేవలం ఒక దారం కాదని... అది మన మధ్య అనుబంధాలకు భావోద్వేగాల సంకేతమని పేర్కొన్నారు. మహిళలకు మేలు చేయడానికి తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యతను ఇస్తోందని పవన్ తెలిపారు.

తల్లికి వందనం, దీపం-2 పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ఆగస్ట్ 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. ప్రజాజీవితంలో తాను వేసే అడుగుల్లో ఆడపడుచులకు ఎప్పుడూ అండగా నిలుస్తానని చెప్పుకొచ్చారు. తాను ఎప్పుడూ మహిళల అభివృద్ధి కోసం ఆలోచిస్తుంటానని చెప్పారు.

# పాపకొల్లు గ్రామ పంచాయతీలో ఎన్నిసార్లు అధికారులకు సమస్యలు విన్నవించిన శూన్యం.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 09,**జూలూరుపాడు మండలం పాపకొల్లు గ్రామం ఇటీవల కాలంలో కురుస్తున్నభారీ వర్షాలకు భీమ్లాతండా గుమ్మడి రామారావు ఇంటి వద్ద అధ్వాన స్థితిలో సిమెంట్ రోడ్డుపై నీళ్లు నిలవడం మరియు పుల్లయ్య తండా వెళ్లే మార్గంలో అనుములు శ్రీనివాసరావు ఇంటి వద్ద భారీగా నీళ్లు నిలవడం సిమెంట్ రోడ్లు మెయిన్ రోడ్డు కంటే అటు వెళ్లే రోడ్డు డౌన్ గా ఉండటం వల్ల అనేకమంది ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేలకు విన్నవించిన సమస్యలు శూన్యం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉమ్మడి ఖమ్మం జిల్లా లో వైరా నియోజకవర్గంలో జూలూరుపాడు మండలం పాపకొల్లు గ్రామంలో ఎక్కడి సమస్యలు అక్కడే గ్రామంలో ఉన్నటువంటి సమస్యలు శూన్యంనిమ్మకు నేరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు ఇకనైనా అధికారులు మేల్కొని గ్రామం లోని సమస్యలను తీర్చాలని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామస్తులు ఆవేదన మరియు జిల్లా అధికారులు గ్రామాన్ని సందర్శించి సమస్యలను ఎదుర్కొంటున్న ప్రజలు తమ తమ అవసరాలను తీర్చాలని ఆవేదన చెందుతున్నారు గ్రామంలో రోడ్లు చిత్తడిగా మరియు పంట పొలాలకు వెళ్లే రహదారులు కూడా ఇదే మాదిరిగా ఉన్నాయి గ్రామంలో బడిగుడి సదుపాయాలు సమకూర్చాలని ఆవేదన నిత్యం 24 గంటలు గ్రామంలో స్ట్రీట్ లైట్స్ వెలుగుతూ ఉంటుంటే పట్టించుకోవడం శూన్యం గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలియపరిచిన పంచాయతీ లో నిధుల్లోని అంటున్నారు కనీసం గ్రామంలో చెత్తాచెదారాన్ని ఎత్తకుండా తమ తమ జీవితాలు రావటం లేదని ఆవేదన మల్టీపర్పస్ వర్కర్స్ దౌబాగ్య స్థితిలో ఉన్నటువంటి గ్రామపంచాయతీ ని ఇకనైనా అధికారులు మేల్కొని తమ తమ అవసరాలను తీర్చాలని ఆవేదన చెందుతున్నారు పాపకొల్లు గ్రామ పంచాయతీ ప్రజలు..

# పల్లె రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి.

- రహదారుల నిర్మాణంతో గ్రామాలను అనుసంధానిస్తున్నాం.
- ప్రతి గ్రామానికి పక్కా రహదారుల నిర్మించేదిశగా ప్రణాళిక.
- రవాణా సౌకర్యం మెరుగుపడితేనే గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయి.
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు.
- 2.50కిలోమీటర్ల నన్యాతండా- బేతంపూడి రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా / సుజాతనగర్ ప్రతినిధి,( సాయి కౌశిక్ )ఆగస్టు 09,**గ్రామీణ ప్రాంతాలకు రవాణాసౌకర్యం మెరుగుపర్చేందుకు ముమ్మరంగా రహదారుల నిర్మాణాలు చేపడుతున్నామని, రహదారుల నిర్మాణం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి అనతికాలంలోనే పూర్తిచేసి ప్రజలకు అందుబాటు లోకి తెస్తామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పంచాయతి రాజ్ రోడ్ల శాఖ రూ.1.80కోట్ల నిధులతో మండలంలోని బేతంపూడి నుంచి నల్లవాగు మీదుగా నాన్యతాండా వరకు 2.50కిలోమీటర్ల బిటి రోడ్డు పనులకు శనివారం కూనంనేని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన శంకుస్థాపన సభలో కూనంనేని మాట్లాడుతూ ప్రతి గ్రామానికి పక్కా రహదారి సౌకర్యం కల్పించి రవాణావ్యవస్థను మెరుగుపర్చడంతోపాటు గ్రామాలు, పట్టణాలను అనుసంధానించేందుకు నిరంతర కృషి జరుగుతోందని, రవాణా సౌకర్యం మెరుగుపడితేనే గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయని అన్నారు. పంచాయతి రాజ్ శాఖా నుంచి నియోజకవర్గంలో 8.50కిలోమీటర్ల రహదారుల నిర్మాణానికి రూ.15 కోట్లు మంజూరయ్యాయని త్వరలో పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. రహదారులతోపాటు ప్రజల కనీస అవసరాలైన విద్యుత్ సౌకర్యం, వైద్యం, డ్రైన్ల, త్రాగునీటి వసతి కల్పించేందుకు చేసిన కృషి ఫలితంగా ఇప్పటివరకు 80శాతం మేర పనులు పూర్తికాగా, కొన్ని గ్రామాల్లో నిర్మాణదశలో ఉన్నాయన్నారు. త్వరలోనే నియోజకవర్గం లో సమస్యలులేని గ్రామాలు ఆవిష్కృతమవుతాయని, మునుపెన్నడూ లేని అభివృద్ధిని సాధించి చూపెడుతున్నామన్నారు. నిర్మాణ పనుల్లో కచ్చితంగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే ఉపేక్షించేదిలేదని దీనికి అధికారులే బాధ్యత వహించాల్సిఉంటుందని హెచ్చరించారు. శంఖుస్థాపని కు వచ్చిన ఎమ్మెల్యే కూనంనేనిని శాలువా, పూలమాలలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, సొసైటీ చైర్మన్ హన్మంతరావు, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్యా దస్రు, మండల కార్యదర్శి కొమారి హన్మంతరావు, జిల్లా సమితి సభ్యులు జక్కుల రాములు, టి.పాపారావు, ధర్మారావు, మూడు గణేష్, కొమారి కృష్ణ, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు రాఖీ కట్టిన కాపు సీతాలక్ష్మి.

- వారి నివాసంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 09,** కొత్తగూడెం రామవరం కొత్తగూడెం మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి నివాసంలో ఘనంగా రాఖి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా జర్నలిస్టులు రత్నకుమార్ కిరణ్ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి నివాసానికి వచ్చి రాఖీ కట్టించుకొని శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి సందర్భంగా గ్రామ గ్రామాన వాడవాడలో రక్షాబంధన్ సంబరాలు ఘనంగా జరుపుకున్నారని . అన్నా చెల్లెలు,అక్క తమ్ముళ్లు ఆప్యాయతకు ప్రతీక రక్షాబంధన్ జరుపుకుంటారు. సోదరి సోదరుని క్షేమం కోరుతూ సోదరుడు సోదరికి ఎల్లవేళలా రక్షణగా నిలుస్తాడు.ఈ ప్రేమను బంధానికి చిహ్నమేరాఖీ పండుగ జరుపుకుంటారు.ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో జరుపుకునే ఈ పండుగ ఆడపడుచులు పుట్టింటికి వెళ్లి అన్న, తమ్ముడు రాఖీ కట్టి వెళుతుంటారు.వీరందరూ క్షేమంగా సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తూ అక్కా చెల్లెల్లకు,ఆడపడుచులకు, మహిళలు రాఖీ పౌర్ణమి జరుపుకుంటారు అని అన్నారు.

# గ్రామ పంచాయతీ భవనం నుంచి మొదలు సెక్రటేరియట్ వరకు అన్ని భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ లు.

- ఇందిరా సౌర గిరిజల వికాస పథకం అమలును వేగవంతం చేయాలి.
- ఏజెన్సీ ప్రాంత అధికారులు ఆర్ ఓ ఎఫ్ ఆర్ భూముల వివరాలు పంపండి.
- సౌర విద్యుత్ ఉత్పాదకత దిశగా ప్రభుత్వం అడుగులు.
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 09,** రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పాదకత దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు.

శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి (ఎనర్జీ) నవీన్ మిట్టల్, రెడ్ కో సి.ఎం.డి., ఎస్.పి.డి.సి.ఎల్. సి.ఎం.డి, సింగరేణి కాలరీస్ సి.ఎం.డి లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సోలార్ సిస్టం ఇన్స్టాలేషన్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సౌర విద్యుత్ ఉత్పాదకత దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇందు కొరకు రాష్ట్రంలోని ప్రభుత్వ భవనాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు, ఆర్. ఓ. ఎఫ్. ఆర్. భూముల వివరాలతో నిర్ణీత నమూనా ప్రకారం నివేదిక రూపొందించి వారం రోజులలోగా సమర్పించాలని తెలిపారు. జిల్లాలలో గల ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల భవనాల రూఫ్ టాప్ పై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ వహించి అన్ని జిల్లాల కలెక్టర్లు వారంలోగా సంబంధిత వివరాలను ఎనర్జీ డిపార్ట్మెంట్ కు పంపించాలని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాలలోని 6 లక్షల 17వేల ఎకరాలలో సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఈ క్రమంలో 3 సంవత్సరాల లోపు ప్రక్రియ పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఐ డి ఓ సి కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పాల్గొన్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లాలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఖాళీ ప్రభుత్వ స్థలాల వివరాలను నిర్ణీత నమూనాలో అందించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని ఆదివాసీ ప్రజలను అన్ని రంగాల్లో ముందుంచడమే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యం.





- ఎస్పీ రోహిత్ రాజు.
- కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు.
- కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుండి కొత్తగూడెం క్లబ్ వరకు పోలీస్ అధికారులు, ఆదివాసీ నాయకులు, స్థానికులతో భారీ ర్యాలీ నిర్వహణ.
- కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజు.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 09,**

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ ప్రాంగణం నుండి కొత్తగూడెం క్లబ్ వరకు భారీ ర్యాలీని నిర్వహించారు. కొత్తగూడెం డిఎస్పి రెహమాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో పోలీస్ అధికారులు ఆదివాసీ నాయకులు ప్రజలు స్థానికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం కొత్తగూడెం క్లబ్లో ఈ ర్యాలీ నందు పాల్గొన్న ఆదివాసీ నాయకులు ప్రజలతో సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ముందుగా జిల్లా ప్రజలకు ప్రపంచ ఆదివాసి దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశార. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శనివారం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఆదివాసి జిల్లాగా పేరొందిన భద్రాద్రి జిల్లాలో నివసించే ఆదివాసి ప్రజలు అన్ని రంగాల్లో ముందుండేలా చూడడమే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఎస్పీ గారు తెలిపారు. ఇందులో భాగంగానే ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజల కోసం ప్రభుత్వం తరఫున జిల్లా పోలీస్ శాఖ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని అన్నారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసి ప్రజలకు విద్య,వైద్యం, రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే యువత కోసం స్పోర్ట్స్ కాంప్లెక్స్ లు ఏర్పాటు చేయడమే కాకుండా వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు శిక్షణ తరగతులను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. చర్ల మండలంలోని చెన్నాపురం,పూసుగుప్ప సరిహద్దు గ్రామాల్లో సుమారుగా రెండు కోట్ల రూపాయల వ్యయంతో రెండు మొబైల్ హాస్పటల్ లను, దుమ్ముగూడెంలో రెండు కోట్ల రూపాయల వ్యయంతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను,పూసగుప్ప నుండి చత్తీస్గఢ్ సరిహద్దు వరకు రెండు కిలోమీటర్ల దూరం రోడ్డును సుమారుగా మూడు కోట్ల రూపాయలతో నిర్మించడం జరిగిందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంత యువతకు ఉపయోగపడే విధంగా ప్రతి నియోజకవర్గ కేంద్రంలో పోలీస్ శాఖ సహకారంతో గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ పునరావాస పాలసీకి ఆకర్షితులై ఈ సంవత్సర కాలంలో సుమారుగా 300 మందికి పైగా నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన సభ్యులు లొంగిపోవడం జరిగిందని తెలిపారు.జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీలకు అండగా ఉంటూ వారి సంక్షేమం, అభివృద్ధి కొరకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం జిల్లాలోని ఆదివాసీ కుటుంబాల నుండి ఉద్యోగాలలో మరియు చదువులో ప్రతిభ కనబరిచిన వారిని ఘనంగా సత్కరించారు.ఈ సమావేశంలో పాల్గొన్న వారందరికీ ఈ సందర్భంగా సహపంక్తి భోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి రెహమాన్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ కొత్తగూడెం టూ టౌన్ ఇన్స్పెక్టర్ ప్రతాప్,చుంచుపల్లి సిఐ వెంకటేశ్వర్లు, కొత్తగూడెం వన్టౌన్ సిఐ కరుణాకర్, 03 టౌన్ సీఐ శివ ప్రసాద్ మరియు ఇతర పోలీసు అధికారులు సిబ్బంది,ఆదివాసీ నాయకులు,స్థానికులు పాల్గొన్నారు.

# ఎన్జీవోస్ కాలనీ, పడవలతో చిన్నారులు

**ఆగస్టు 09 (సి కె న్యూస్) చేగుంట :** చేగుంట మండల కేంద్రంలోని ఎన్జీవోస్ కాలనీలోని ఒక గల్లీలో రాఖీ పౌర్ణమి నాడు పడ్డ వర్షానికి పూర్తిగా రోడ్డు మొత్తం వర్షపు నీటితో నిండిపోయింది. ఈ వర్షపు వరదలో కాగితపు పడవలతో ఆడుకుంటున్న చిన్నారులు. ఈ కాలనీలో ఎప్పుడు వర్షం పడ్డ ఇదే పరిస్థితి. చిన్నగా వర్షం పడితే రోడ్డుపైకి మోరి లోని బురద మొత్తము వచ్చి రోడ్డుపైన నిలుస్తుంది. లేదంటే ఎక్కువ వర్షం పడితే రోడ్డు మొత్తం మునిగిపోతుంది. దీనివలన కాలనీవాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సమయాలలో మోరి బురద



రోడ్డు పైకి రావడం వల్ల చాలా దుర్గంధం వెదజల్లుతుంది అని కాలనీవాసులు వాపోతున్నారు. వర్షం పడ్డప్పుడు ఇంటి నుంచి బయటకు రావాలి అంటే భయపడుతున్న కాలనీవాసులు. దీనివలన కాలనీలో క్రిములు కీటకాలు దోమలు, ఈగలు ఎక్కువగా వస్తున్నాయి. ఈ విషయాన్ని కాలనీవాసులు అధికారులకు, నాయకులకు ఎన్నోసార్లు విన్నవించుకున్నారు అయినా ఏ ఒక్కరు దీనిని పట్టించుకోలేదు. ఈ కాలనీలో మోరికి మధ్యలో కరెంటు స్తంభం ఉన్నది. ఈ స్తంభం వలన నీరు బయటకు వెదజల్లుతున్నది. అలాగే నీరు వరదకు సరిపోయేంత మోరి పెద్దగా లేదు. కావున ఏ ఒక్క అధికార అయినా సరే, రాజకీయ నాయకులైన సరే పట్టించుకోని మా కాలనీకి సిసి రోడ్డు సరైన మోరి వసతులు కల్పించగలరని కాలనీ వాసులు కోరుతున్నారు.

# ఘనంగా 65వ,యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు.

- కేక్ కట్ చేసిన యూత్ కాంగ్రెస్ నాయకులు.




**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఆగస్టు 9.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం. హరియాణా లో....వలిగొండ మండల యూత్ కాంగ్రెస్ నాయకులు 65 వ యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను స్థానికభువనగిరి శాసనసభ్యులు శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆదేశానుసారం, వలిగొండ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మైసోళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి బత్తిని నగేష్, నారి శ్రీకాంత్, మాజీ ఎంపీపీ నూతి రమేష్, మండల అధ్యక్షులు సత్తి రెడ్డి, పట్టణ అధ్యక్షులు కిష్టయ్య, లింగయ్య, సహదేవ్,సతీష్, ఉపేందర్ బోస్, అశోక్, యాదగిరి,బాలరాజు,భాస్కర్, వేంకన్నా, మల్లేష్,వెంకటేష్,బాలస్వామి,పరంధములు, శంకర్, శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ నాయకులు అభిమానులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యేకి రాఖీ కట్టిన మాజీ జెడ్పిటిసి వాకిటి పద్మ అనంతరెడ్డి.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఆగస్టు 9.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం మాజీ జడ్పిటిసి వాకిటి పద్మ అనంతరెడ్డి ఈరోజు రాఖీ పౌర్ణమి వేడుకలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి నివాసంలో రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో పనుమాటి అరుణ,సోలిపురం శ్రీకాంత్ రెడ్డి, అడిషనల్ డీసీపీ పడాల అశోక్ కుమార్ పాల్గొన్నారు.

# అక్క తమ్మునికి రాఖీ కట్టిన వేడుక.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఆగస్టు 9.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని లింగరాజు పల్లి గ్రామంలో గొలనుకొండ శివ శంకర వరప్రసాద్ కు రాఖీ పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ తమ్మునికి రాఖి కట్టిన అక్క గోలనుకొండ చందన, భారతదేశం లో సాంప్రదాయం ప్రకారం ప్రతి సంవత్సరం రాఖీ పౌర్ణమి సందర్భంగా అనుబంధాలకు రక్తసంబంధ లకు ప్రేమానురాగాలకు ప్రతిగా ఈ రాఖీ పౌర్ణమి ఘనంగా ప్రతి కుటుంబంలో ఘనంగా జరుపుకోవడం జరుగుతుంది.

# గ్రామపంచాయతీ భవనం నుంచి మొదలు సెక్రటేరియట్ వరకు అన్ని భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ లు..



- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- ఇందిరా సౌర గిరిజల వికాసం వేగవంతం చేయాలి
- ఏజెన్సీ ప్రాంత అధికారులు ఆర్ఓఎఫ్ఆర్ భూముల వివరాలు పంపాలి

**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, ఆగస్టు -09:**సోలార్ విద్యుత్ ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ విధాన నిర్ణయం తీసుకుందని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుండి ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో ఇందిరా సౌర గిరిజన వికాసం పథకం అమలుపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇట్టి సమీక్ష లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, ఎస్పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫారూఖీ, రెడ్కో సిఎండి అనిలా తదితరులు పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ,అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, పార్కింగ్, క్యాంటీన్ ప్లాన్లు హైదరాబాద్ కు పంపాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు అన్నీ కూడా ఒకే నమూనాలో నిర్మించినందున సోలార్ పవర్ ప్లాంట్ లో ఏర్పాటుకు అవసరమైన డిజైన్లు హైదరాబాదు నుంచి పంపిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. కలెక్టర్ కార్యాలయాల్లో మంచి డిజైన్లు ఉంటే ఆయా కలెక్టర్లు హైదరాబాద్ కు పంపవచ్చని డిప్యూటీ సీఎం సూచించారు.

గ్రామపంచాయతీ బిల్డింగ్ మొదలుకొని సెక్రటేరియట్ వరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటుచేసి పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన వివరాలకు సంబంధించి కలెక్టర్లు హైదరాబాద్ కు పంపాల్సిన వివరాలకు సంబంధించి ఒక ప్రశ్నావళిని పంపిస్తున్నామని, అందులో అన్ని వివరాలు నమోదు చేసి వారం లోపు విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కార్యాలయానికి పంపాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.

ప్రభుత్వ భవనాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, యూనివర్సిటీ భవనాలపై కూడా సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేయాలని అందుకు సంబంధించిన భవనాల వివరాలు పంపాలని కలెక్టర్లను ఆదేశించారు.

నీటిపారుదల శాఖ, రోడ్లు భవనాల శాఖ పరిధిలో పెద్ద ఎత్తున ఖాళీ స్థలాలు ఉన్నాయని, వాటి వివరాలు సైతం పంపాలని కలెక్టర్లకు డిప్యూటీ సీఎం సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్ఓఎఫ్ఆర్ చట్టం కింద 6.70 లక్షల ఎకరాల భూములను ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేసిందని, ఈ భూముల్లో నల్లమల డిక్లరేషన్ కింద ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ద్వారా ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయనున్నట్టు డిప్యూటీ సీఎం కలెక్టర్లకు వివరించారు. నల్లమల డిక్లరేషన్ లో భాగంగా ఇప్పటికే అచ్చంపేట నియోజకవర్గంలో ప్రారంభించామని, ఈ నెలలోనే 16, 17 తేదీల్లో ఆదిలాబాద్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రారంభించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. ఇందిరా సౌర గిరిజల వికాసం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, కలెక్టర్లు ఎక్కడ అలసత్వం ప్రదర్శించకుండా వారంలోగా వివరాలు పంపాలని, ఈ విషయాల్లో ఎలాంటి సందేహాలు ఉన్న విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఎస్పిడీసీఎల్, ఎన్పిడిసిఎల్ సీఎండీలు, రెడ్కో విసి%డ%ఎండి ని సంప్రదించాలని డిప్యూటీ సీఎం కలెక్టర్లను ఆదేశించారు.

సమీక్ష లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, ఖమ్మం కలెక్టరేట్ లో పార్కింగ్ షెడ్ లు సోలార్ ప్యానెళ్లతో నిర్మించినట్లు తెలిపారు. ఆదేశాల మేరకు కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాలు, ఇరిగేషన్ భూములు, దేవాదాయ భూముల వివరాలు సమర్పించనున్నట్లు తెలిపారు.

ఈ సమీక్ష లో విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసా చారి, ఏడిఇ కమర్షియల్ నాగమల్లేశ్వర రావు, రెడ్కో జిల్లా మేనేజర్ అజయ్ కుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# యమ పాశాలుగావిద్యుత్ వైర్లు..

- విద్యుత్ తీగలను పట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు.
- సమస్యను పరిష్కరిస్తామన్న బచ్చోడు విద్యుత్ శాఖ ఏఈ.



**సీకే న్యూస్,తిరుమలాయపాలెం.**తిరుమలాయపాలెం మండలం బచ్చోడు క్లస్టర్ రాజారం గ్రామంలో పిల్లి గుట్టకు వేళ్ళు దారిలో విద్యుత్ వైర్లు చేతికందే ఎత్తులో ఉన్నాయని ఆ గ్రామ రైతులు విద్యుత్ తీగలను చేతితో పట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్నారు.. గత సంవత్సరాల కాలం నుంచి లైన్ మరమ్మత్తులు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు చెబుతున్నప్పటికీ వారు నిర్లక్ష్యం వహిస్తూ రైతుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు.. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం అనే చందాగా విద్యుత్ అధికారుల తీరు కొట్టొచ్చినట్టు కనపడుతుంది.. వర్షాకాలం వస్తే చాలు నిత్యం మండలంలో ఎక్కడో ఒకచోట విద్యుత్ ఘాతానికి పశువులు, రైతులు వీరి నిర్లక్ష్యం వలన రైతులు రోడ్డున పడుతున్నారు..ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి కొత్త విద్యుత్తు స్తంభాలను ఏర్పాటు చేసి ఆ గ్రామ రైతుల సమస్యకు పరిష్కారం చూపించవలసిందిగా ఆ గ్రామ రైతులు కోరుతున్నారు..

మా దృష్టికి రాలేదు మరమ్మతులు చేస్తాం.. బచ్చోడు విద్యుత్ శాఖ ఏఈ మునీర్ పాషా ..

విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్న సంఘటనలో బచ్చోడు విద్యుత్ శాఖ ఏఈ మునీర్ పాషా ను సీకే న్యూస్ ప్రతినిధి వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ..

విద్యుత్తు తీగలు కిందికి వెళ్లడుతున్నాయి అనే విషయం వారి దృష్టికి రాలేదు.. విద్యుత్ పోల్స్ అవసరం ఉన్నది.. విద్యుత్ పోల్స్ కొరకు జిల్లా అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేస్తాం..ఇటువంటి సమస్యలు కొన్నిచోట్ల కనిపిస్తున్నవి..మా సిబ్బందితో సమస్యను పరిష్కరిస్తాము.

# కీలపట్ల శ్రీధర్ స్వామిని సన్మానించిన సామాజిక సేవా కార్యకర్త



**పలమనేరు ఆగస్టు 9 సికే న్యూస్:** గంగవరం మండలం కీల పట్ల గ్రామంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని గత ఏడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న శ్రీధర్ స్వామిని ఈరోజు నేషనల్ హ్యూమన్ రైట్స్ నేషనల్ సెక్రటరీ సామాజిక సేవా కార్యకర్త మధుమోహన్రావు నిత్యాన్నదాన సత్రంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు

మధు మోహన్ రావు మాట్లాడుతూ స్వామివారి సేవలో తరిస్తున్న శ్రీధర్ స్వామి సేవలు విశేషమైనదని ఇటువంటి సేవా కార్యక్రమాలు చేసిన వారిని గుర్తించి సత్కరించడం అదృష్టంగా భావిస్తున్నానని ఈ సందర్భంగా మధుమోహన్రావు తెలియజేశారు

ఈ కార్యక్రమంలో శ్రీధర్ స్వామి మధుమోహన్రావు చంద్ర వేణు నారాయణ తదితరులు పాల్గొన్నారు

# పోరాట యోధుడు కొమరంభీం.

- భీం పోరాట స్ఫూర్తితో హక్కుల సాధనకు ఆదివాసీలు ఉద్యమించాలి.
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా.
- సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా ఆదివాసీ దినోత్సవం.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 09,**

కొత్తగూడెం : ఆదివాసీల హక్కుల పోరాట నీదుడు కొమరం భీం అని, ఆదివాసీల సంక్షేమ, వారి అభ్యున్నతికోసం తన తుదిశ్వాసవరకు పోరాడిన యోధుడు భీం అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిపిఐ, తెలంగాణ గిరిజన సమాఖ్య, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం సిపిఐ జిల్లా కార్యాలయంలో కొమరంభీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ ఆదివాసీల జీవన విధానాన్ని గుర్తించి వారి అభ్యున్నతికోసం పాలకులు కృషి చేయాలనే ఉద్దేశంతోనే ఐక్యరాజ్య సమితి ఆగస్టు 9వ తేదీని ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా ప్రకటించిందని గుర్తుచేశారు. కొమరంభీం, మల్లుదొర, సమ్మక్క, సారక్క లాంటి ఎందరో ఆదివాసీ నాయకులు రాజంగం కల్పించిన చట్టాల, ఆదివాసీ హక్కుల అమలుకోసం ప్రాణత్యాగాలు చేశారని, పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికి ఆదివాసీలు అభివృద్ధికి నోచుకోవడం లేదని అన్నారు. జల్ జంగల్ జమీన్లపై ఆదివాసీలకే సంపూర్ణ హక్కులు ఉన్నాయని, ఆదిలాబాద్ జిల్లా జోడేఘాట్ కేంద్రంగా ఆదివాసీ ప్రజలను కూడగట్టి నిజం నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి అమరుడైన ధీరుడు కొమరం భీం అని అయన సేవలను కొనియాడారు. ప్రపంచ వ్యాపితంగా ఆదివాసీలు ఇంకా అన్ని రంగాల్లో వెనుకబడి వున్నారని దీనికి పాలకుల నేరపూరిత నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. ఆదివాసీలు కలిసికట్టుగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమన్నారు. భీం పోరాట స్ఫూర్తిని కొనసాగించి గిరిజన చట్టాల అమలు, పరిరక్షణకోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, భూక్య దస్రు, కందుల భాస్కర్, జిల్లా సమితి సభ్యులు మునిగడప వెంకటేశ్వర్లు, భూక్య శ్రీనివాస్, ప్రజాసంఘాల నాయకులు పల్నాటి ప్రశాంత్, నర్సయ్య, బోయిన విజయ్ కుమార్, షాహీన్, విజయలక్ష్మి, బాణోత్ శ్రీనివాస్, రాజేశ్వర్ రావు, బాణోత్ చందర్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# తన అక్కచెల్లెళ్లతో రాఖీ కట్టించుకున్నా ఎల్ హెచ్ పి ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దశరథ్ నాయక్



**సికె న్యూస్ ప్రతినిధి** తల్లాడ మండలం రంగం బంజర్ గ్రామంలోని తన నివాసం వద్ద ముగ్గురు అక్క చెల్లెల చిలికి బాయి పార్వతి బాయి చిట్టి బాయిల చేత రాఖీ పండుగ సందర్భంగా రాఖీ పులు కట్టించుకుంటున్న లంబాడి హక్కుల పోరాట సమితి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మరియు గోర్ బంజారా జాతీయ రత్న అవార్డు గ్రహీత ధర్మసోత్ దశరథ్ నాయక్.

# కీలపట్ల శ్రీధర్ స్వామిని సన్మానించిన సామాజిక సేవా కార్యకర్త

**సికె న్యూస్ ప్రతినిధి పలమనేరు ఆగస్టు 9:** గంగవరం మండలం కీల పట్ల గ్రామంలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని గత ఏడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న శ్రీధర్ స్వామిని ఈరోజు నేషనల్ హ్యూమన్ రైట్స్ నేషనల్ సెక్రటరీ సామాజిక సేవా కార్యకర్త మధుమోహన్రావు నిత్యాన్నదాన సత్రంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు

మధు మోహన్ రావు మాట్లాడుతూ స్వామివారి సేవలో తరిస్తున్న శ్రీధర్ స్వామి సేవలు విశేషమైనదని ఇటువంటి సేవా కార్యక్రమాలు చేసిన వారిని గుర్తించి సత్కరించడం అదృష్టంగా భావిస్తున్నానని ఈ సందర్భంగా మధుమోహన్రావు తెలియజేశారు

ఈ కార్యక్రమంలో శ్రీధర్ స్వామి మధుమోహన్రావు చంద్ర



వేణు నారాయణ తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన మహిళలు



## వెలకట్టలేని మధుర బంధమే రక్షాబంధన్... ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**పెబ్బేరు ఆగస్టు09 (సి కే న్యూస్)**మహిళల రక్షణ,ఆర్థిక భద్రతకు కాంగ్రెస్ ప్రభుత్వం భరోసా ఇస్తుందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. రక్షాబంధన్ సందర్భంగా వనపర్తి నియోజకవర్గంలోని శనివారం పలువురు మహిళలు రాఖీ కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. .వెలకట్టలేని మధుర బంధమే రక్షాబంధన్ అని అన్నారు. రెండేళ్ల క్రితం తాను బాగుండాలని,ఎమ్మెల్యేగా ఎన్నికవ్వాలని ఎంతో మంది అక్కచెల్లెళ్లు కోరుకున్నారన్నారు. వారి దీవెనలతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని,నేను అధికారంలో ఉన్నంతవరకు అక్కచెల్లెళ్ళ అవసరాలు తీర్చి వారి రుణం తీర్చుకుంటానన్నారు.

# అనుబంధాల పండుగ రాఖీ.

- ప్రేమ, నమ్మకం, రక్షణ అనే విలువలను గుర్తుచేసే పవిత్రమైన ఆచారం రాఖీ పూర్ణమి.
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఆగస్టు 09,**భారతీయ సంస్కృతిలో రాఖీ పండుగకు విశిష్టమైన స్థానం ఉందని, అనుబందాల పండుగగా రాఖీ పండుగను జరుపుకోవడం మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. బ్రహ్మ కుమారి మటం, భారత జాతీయ మహిళా సమాఖ్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆద్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ఎమ్మెల్యే నివాసం, శేషగిరిభవన్లో శనివారం రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కూనంనేనికి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషాకు బ్రహ్మకుమారి మటం సభ్యులు, మహిళాసమాఖ్య కార్యకర్తలు రాఖీలు కట్టి, స్వీట్లు పంపిణీ పంపిణి చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ శ్రావణమాసం లో వచ్చే విశిష్టమైన పండుగ రాఖీ పండుగని అన్నారు. ఈ పండుగకోసం తోబుట్టువులంతా ఏడాదంతా ఎదురుచూస్తుంటారని, వీది నిర్వహణలో ఎంత దూరం ఉన్నప్పటికి కుటుంబ సభ్యులందరిని ఒక్కటి చేసి కుటుంబ బాంధ్యవ్యాంన్ని, బందుత్వాన్ని గుర్తు చేస్తుందన్నారు. రాఖీ పండుగ మన సమాజంలో ప్రేమ, నమ్మకం, రక్షణ అనే విలువలను గుర్తుచేసే పవిత్రమైన ఆచారమని, సోదర, సోదరీమణుల బంధాన్ని మాత్రమే కాకుండా పరస్పర గౌరవం, మానవతా భావన, సామాజిక ఐక్యతను బలపరుస్తుందన్నారు. ఈ సాంప్రదాయాన్ని కాపాడుకోవడం, యువతకు అందించడం మనందరి బాధ్యత. సోదరులు సోదరీమణుల రక్షణకే కాక, సమాజం మొత్తానికి రక్షకులుగా నివాలన్నారు. తనకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారి మటం సభ్యులకు, మహిళా సమాఖ్య నాయకులకు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రికి ఆత్మీయ వీడ్కోలు.



**పాడేరు, ఆగస్టు 9 సీ కే న్యూస్** ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల అనంతరం తిరిగి పయనమవుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు లగిసిపల్లిలో ఆత్మీయ వీడ్కోలు లభించింది. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల నేపథ్యంలో వివిధ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, పలు ఒప్పందాలపై సంతకాలు ముగించుకొని బహిరంగ సభలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం శనివారం మధ్యాహ్నం 3.30 గం.లకు సీఎం హెలీప్యాడ్ కు చేరుకొని అక్కడ నుంచి విజయవాడకు తిరుగు పయనమయ్యారు. ఆత్మీయ వీడ్కోలు పలికిన వారిలో రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖామాత్యులు మరియు జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, నియోజక వర్గ ఇన్ చార్జ్ గిడ్డి ఈశ్వరి, అప్పల సరసయ్య, గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎం.ఎం. నాయక్, డైరెక్టర్ ఎస్.భార్గవి, జీసీసీ వైస్ చైర్మన్, ఎండీ కల్పనా కుమారి, జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్, జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె.అభిషేక్ గౌడ, పాడేరు సబ్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్ తదితరులు ఉన్నారు.

## పొలం బాట పట్టిన కలెక్టర్ విజయ్ కృష్ణన్.



**చీడికాడ(అనకాపల్లి )ఆగస్టు 9 సీ కే న్యూస్** శనివారం చీడికాడ మండలం కోనాం గ్రామంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పొలం బాట పట్టారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కోనాం గ్రామంలో పాల్గొన్నారు.అనంతరం కోనాం గ్రామంలో ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ, సుందరాపు విజయ్ కుమార్, కె.ఎస్. సూర్యనారాయణ రాజుతో కలిసి వరి పొలంలోకి దిగి ఉత్సాహంగా వరి నాట్లు వేశారు.అనం తరం రైతులతో ముచ్చటించి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు.కలెక్టర్, ఎమ్మెల్యేలు పొలంలోకి రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు తమ వ్యవసాయ పద్ధతులు, సమస్యలు, పంటల పరిస్థితులను వివరించారు. కలెక్టర్ వారికి తగిన సలహాలు ఇచ్చి, అవసరమైన సాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు.

## సిలిండర్ పేలుడు ఘటనలో మృతుల కుటుంబాలనురూ.10 లక్షల ఆర్థిక సహాయం.

**మృతుల ఇళ్లకు వెళ్లి చెక్కులు అందజేసిన హెూం మంత్రి అనిత.**



**విశాఖపట్నం సీ కే న్యూస్** :నగరంలోని ఫిషింగ్ హార్బర్ ప్రాంతంలో బుక్కావీధి వద్ద వెల్డింగ్ షాపులో గురువారం సాయంత్రం సిలిండర్ పేలుడు జరిగి ముగ్గురు మరణించిన ఘటనలో ఆయా మృతుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకొంది. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల సహాయం అందించనున్నట్టు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే ప్రకటించగా ఈ మేరకు ముఖ్యమంత్రి ప్రకటించిన సహాయాన్ని రాష్ట్ర హెూం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత శనివారం అందజేశారు. నగరంలోని ఫిషింగ్ హార్బరు ప్రాంతంలో నివసిస్తున్న మృతుడు చింతకాయల ముత్యాలు ఇంటికి శనివారం విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, నగర మేయర్ పీలా శ్రీనివాసరావులతో కలసి వెళ్లి పరామర్శించారు. ముత్యాలు భార్య ప్రమీల, వెల్డింగ్ షాపులో పనిచేసే మరో వ్యక్తి శ్రీను భార్య లక్ష్మిలతో మాట్లాడి వారికి ప్రభుత్వం అండగా వుంటుందని, ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు. అనంతరం ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల సహాయానికి సంబంధించిన చెక్కులు అందజేశారు. సున్నపు వీధిలో నివసిస్తున్న వెల్డింగ్ షాపు యజమాని మృతుడు గణేష్ ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని హెూం మంత్రి పరామర్శించారు. ఆయన భార్య సుధకు ధైర్యం చెప్పి రూ.10 లక్షల చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా హెూం మంత్రి మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటనలో ముగ్గురు వ్యక్తుల మరణించారని, గాయాల పాలైన వారిలో ఎర్రా ఎల్లాజీ, రంగారావులో కె.జి.హెచ్.లోను, పి.సన్యాసి మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు. వారికి అందుతున్న వైద్య చికిత్సలను నిరంతరం పర్యవేక్షించాల్సిందిగా, మెరుగైన వైద్య అందించేలా అధికారులను, ఆసుపత్రి వైద్యులను ఆదేశించామని చెప్పారు. వెల్డింగ్ షాపు సమీపంలోని పలు దుకాణాల్లో వున్న వారు కూడా ఈ ఘటనలో గాయపడినట్లు తెలిసిందని, వారికి కూడా వైద్య సహాయం అందిస్తున్నట్టు తెలిపారు. ఈ ఘటనలో వెనువెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టిన నగర పోలీసు కమిషనర్, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులను అభినందించారు.సిలిండర్ పేలుడు ఘటనపై పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణుల దర్యాప్తు జరుగుతోందని, పేలుడుకు గల కారణాలపై ఇప్పుడే ఒక నిర్ధారణకు రాలేమని చెప్పారు. సముద్రంలో దొరికిన గుర్తు తెలియని వస్తువులను భద్రపరచడం, వాటి గురించి అధికారులకు సమాచారం ఇవ్వడంపై పోలీసు, రెవిన్యూ శాఖల ద్వారా మత్స్యకారుల్లో అవగాహన కలిగిస్తామని చెప్పారు.

ఈ పర్యటనలో కార్పొరేషన్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అరకు కాఫీ బ్రాండింగ్ కి టాటా సంస్థతో ఎంఓయూ.






- ఐటీడీఏలతో రబ్బర్, కాఫీ బోర్డులు ఒప్పందాలు.
- పర్యాటకంలో హెూమ్ స్టేల అభివృద్ధికి ముందుకొచ్చిన ఓయో.
- సీఎం సమక్షంలో గిరిజనాభివృద్ధికి కుదిరిన 21 ఒప్పందాలు.

**అల్లూరి జిల్లా బ్యూరో చీఫ్ సీ కే న్యూస్** గిరిజన ప్రాంతాల అభివృద్ధి, ఆదివాసీలకు జీవనోపాధి అవకాశాలు, వ్యవసాయ అభివృద్ధి, అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించటం లాంటి అంశాల్లో ఏపీ ప్రభుత్వం కీలకమైన ఒప్పందాలను కుదుర్చుకుంది. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఈ ఒప్పందాలు కుదిరాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగంలోని వివిధ సంస్థలు ఈ ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. అరకు కాఫీ మార్కెటింగ్ సహా వివిధ అటవీ, గిరిజన ఉత్పత్తులకు దేశీయంగా, విదేశాల్లో మార్కెటింగ్ కల్పించేలా ఈ అవగాహనా ఒప్పందాలు కుదిరాయి. రంపచోడవరం ఐటీడీఏ ప్రాంతంలో రబ్బరు సాగును ప్రోత్సహించేందుకు వివిధ మౌలికసదుపాయాల కల్పన, సాగు విస్తరణ కోసం కేంద్రీయ రబ్బర్ బోర్డు ఐటీడీఏ తో ఒప్పందం కుదుర్చుకుంది. గిరిజన ఉత్పత్తుల విక్రయాలు, అరకు కాఫీకి ప్రోత్సాహం కల్పించేందుకుగానూ జీసీసీతో ఒప్పందం కుదిరింది. స్థానికంగా డ్వాక్రా మహిళలు రూపొందించిన ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేందుకు ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో అరకు కాఫీ కియోస్క్ ను మెప్మా ద్వారా ఏర్పాటు చేసేందుకు కూడా మరో ఒప్పందం కుదిరింది. ఇక గిరిజన సహకార కార్పోరేషన్ ఉత్పత్తులను అమెరికా లాంటి దేశాల్లో విక్రయించేందుకుగానూ హాతీ సర్వీసెస్ ఎల్ఎల్ సీ కంపెనీతోనూ జీసీసీ ఒప్పందం చేసుకుంది. యూఎస్ఏలోనూ జీసీసీ సంస్థ తన రీటైల్ ఆపరేషన్స్ చేపట్టేలా ఈ ఒప్పందం తోడ్పడనుంది. గిరిజన ఉత్పత్తులను ఏపీతో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో విక్రయించేందుకు గానూ ట్రైఫెడ్ -ఏపీ జీసీసీలు సంయుక్తంగా రీటైల్ షోరూమ్ లను ఏర్పాటు చేసేందుకు ఈ రెండు సంస్థల మధ్య ఒప్పందం కుదిరింది. గిరిజనుల ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు ఉద్దేశించి ఈ ఒప్పందం తోడ్పడనుంది. అలాగే షోరూముల వద్ద అరకు కాఫీ కియోస్క్ లను ఏర్పాటు చేయాలని కూడా ఒప్పందంలో అవగాహన కుదిరింది. ప్రముఖ కార్పోరేట్ దిగ్గజం టాటా కన్స్యూమర్స్ సంస్థ కూడా ఆర్గానిక్ అరకు కాఫీని బ్రాండ్ చేసేందుకు, మార్కెట్ చేసేందుకు జీసీసీతో ఒప్పందం చేసుకుంది. చింతపల్లిలో రెడ్ చెర్రీ పండ్ల రైపెనింగ్, ప్రాసెసింగ్ యూనిట్ సహా మౌలిక సదుపాయాల కల్పన కోసం సబ్ కో సంస్థ ఎంఓయూని కుదుర్చుకుంది.

### ఏజెన్సీలో హెూమ్ స్టేల అభివృద్ధికి ఎంఓయూలు.

ప్రస్తుతం ఉన్న ప్రాంతంతో పాటు అదనంగా 1600 హెక్టార్లలో కాఫీ ప్లాంటేషన్ విస్తరించేందుకు ఐటీసీ సంస్థ ఐటీడీఏ పాడేరుతో ఒప్పందం చేసుకుంది. ఇప్పటికే 4010 హెక్టార్లలో స్థానిక రైతుల సహకార సంస్థతో కలిసి ఐటీసీ కాఫీని సాగుచేస్తోంది. కాఫీ బోర్డు కూడా గిరిజన ప్రాంతాల్లో కాఫీ సాగు విస్తరణ, నాణ్యమైన కాఫీ పంట ఉత్పత్తి, సాగులో సుస్థిర విధానాల అమలు కోసం ఒప్పందం చేసుకుంది. గిరిజన మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు గ్రామీణ ప్రాంతాల్లో మార్కెటింగ్ కల్పించే అంశంపై ఫ్రాంటియర్ మార్కెటింగ్, ఈజీ మార్ట్ సంస్థలు ప్రభుత్వంతో ఒప్పందాన్ని చేసుకున్నాయి. పసుపు ఉత్పత్తి, వివిధ టర్మరిక్ ఉత్పత్తులకు మార్కెటింగ్ ను అనుసంధానించటం, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం ఎక్విప్ సంస్థ ఐటీడీఏతో ఎంఓయూ కుదుర్చుకుంది. సీజన్ల వారీగా ఉత్పత్తి అయ్యే అటవీ ఉత్పత్తులను గిరిజన మహిళా సంఘాల ద్వారా విక్రయించేందుకు వీలుగా అవగాహన కల్పించేందుకు ఐఎస్బీ సంస్థ మరో కీలకమైన ఒప్పందం చేసుకుంది. ఇక పర్యాటక రంగంలో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా గిరిజన ప్రాంతాల్లో హెూమ్ స్టేలను ఏర్పాటు చేసేందుకు ఓయో హెూమ్స్, హెూమీ హట్స్ సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. గిరిజన విద్యార్థుల్లో నైతిక విలువల పెంపుకోసం మార్పు సొసైటీ కూడా ఎంఓయూ చేసుకుంది. అలాగే ప్రకృతి సేద్యం, మార్కెటింగ్ సదుపాయాలు, జీవనోపాధి తదితర అంశాల్లోనూ అవగాహనా ఒప్పందాలు కుదిరాయి. గిరిజన పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగు పర్చేందుకు ఏపీ టూరిజం ఫోరం ముందుకు వచ్చింది.







# ఆదివాసీ బిడ్డలు ఉన్నత స్థాయికి చేరాలి.







- కోణంలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం.
- కలెక్టర్ విజయ కృష్ణన్

**చీడికాడ(అనకాపల్లి) సీ కే న్యూస్** ఆదివాసి బిడ్డలు ఉన్నత స్థాయికి చేరాలని, అందుకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని సదుపాయాలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం ఉదయం చీడికాడ మండలం కోనాం గ్రామంలోని ప్రభుత్వ గిరిజన గురుకుల బాలికల పాఠశాల భవనంలో ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ గిరిజన సమాజం మన సంస్కృతి, పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోందని, వారి సంప్రదాయాలు, ఆచారాలు మనకు గర్వకారణం అని పేర్కొన్నారు. విద్యార్థులు చెడు పట్ల ప్రభావితం కాకుండా నిర్దేశించుకున్న లక్ష్యసాధన దిశగా దృష్టి సారిస్తే మంచి ఫలితాలు సాధ్యమై ఉన్నత స్థానాలను అధిరోహించడం జరుగుతుందన్నారు. ధైర్య సాహసాలు గల ప్రతి విద్యార్థి క్రీడల పట్ల ఆసక్తి కనబరచాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థానాల్లో ఉంటూ ఏ సమాజం నుంచి మనం వచ్చామో వారిని అభివృద్ధి చేసే దిశగా ఎదగాలని సూచించారు. ఈ వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు చేరవేయడం మనందరి బాధ్యత అని తెలిపారు.వి.మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణ మూర్తి యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూగిరిజనుల జీవన విధానం ప్రకృతితో మమేకమై ఉంటుంది. ఈ విలువైన జీవనశైలిని యువత అర్థం చేసుకోవాలి. గిరిజన కళలు, నృత్యాలను ప్రోత్సహించడం ద్వారా వారి సంస్కృతిని నిలబెట్టాలి అని సూచించారు.చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్. ఎన్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్య, వృత్తి పరమైన అవకాశాలు కల్పించేందుకు కట్టుబడి ఉందని ఈ దిశగా మరిన్ని హాస్టళ్లు, విద్యా సదుపాయాలు అందిస్తాం అని అన్నారు.కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యేలు ఉత్సాహంగా పాల్గొని విద్యార్థుల ప్రదర్శనలకు అభినందనలు తెలిపారు. ప్రత్యేకంగా కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే బండారు గిరిజన నృత్యం చేసి సభను అలరించారు. విద్యార్థులు గిరిజన వస్త్రధారణలో వివిధ కళారూపాలను ప్రదర్శించగా, విద్యార్థినీలు సంప్రదాయ సోది చెబుతూ అతిథులను ఆకట్టుకంటున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ మరియు సాధికారత అధికారి జి. మంగవేణి, జిల్లా విద్యాశాఖ అధికారి జి. అప్పారావు నాయుడు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హైమావతి, తహసీల్దార్, ఎంపీడీవో వి. హేమసుందరరావు, ఎంఈవోలు కె. బొంజుబాబు, బి.వి. రమణ, స్థానిక హెచ్ఎం యు.వి. రమణమూర్తి, రిటైర్డ్ హెచ్ఎం చలుగు జగన్నాధం నాయుడు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, పెద్ద ఎత్తున విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

## పోలీసులకు రాఖీ కట్టి సోదరభావం చాటిన - హెూం మంత్రి అనిత.



**విశాఖ సీ కే న్యూస్** శనివారం విశాఖలో హెూమ్ మినిస్టర్ అనిత పర్యటన చేపట్టారు.రక్షాబంధన్ సందర్భంగా విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు హెూంమంత్రి అనిత రాఖీ కట్టి సోదర భావాన్ని వ్యక్తం చేశారు. విశాఖ ఎం.వీ.పీ కాలనీ నుంచి ఉషోదయ జంక్షన్ వరకు ఆటోలో ప్రయాణించిన హెూంమంత్రి ఆటో డ్రైవర్ గిరీశ్ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. డ్రైవర్ కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న కానిస్టేబుల్ కొర్లయ్యను ఇంటికి వెళ్లి పరామర్శించి, రాఖీ కట్టారు.అనారోగ్యంతో ఇబ్బంది పడుతూనే అంకితభావంతో విధులు నిర్వహిస్తుండడంపై అభినందించారు. ఆయనకు ధైర్యం చెప్పారు. కానిస్టేబులుకు పూర్తి సాయం అందిస్తామని హెూంమంత్రి అనిత అన్నారు. అనంతరం విశాఖపట్నంలోని కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె జైల్లోని యువ ఖైదీలకు రాఖీలు కట్టారు. మంత్రి మొత్తం 30 మంది ఖైదీలకు స్వయంగా రాఖీలు కట్టి,వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గంజాయి రవాణాలో నిందితులుగా ఉన్న ఖైదీలకు అవగాహన కల్పించారు. తెలిసి తెలియని వయస్సులో ఈజీమనీ కోసం తీసుకునే నిర్ణయాలు జీవితాన్ని నాశనం చేస్తాయని చెప్పారు.మంచి%-%చెడులను యువత తెలుసుకోవాలన్నారు. మీకు బంగారు భవిష్యత్తు ఉందని,దాన్ని నాశనం చేసుకోకండి,అని మంత్రి అన్నారు. బ్రతకడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని, ఖైదీల జీవితాల్లో మార్పు రావాలన్నారు. వచ్చే సంవత్సరం రాఖీ పండుగను మీ ఇంటి వద్ద కుటుంబ సభ్యులతో జరుపుకునే స్థితికి చేరాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జైళ్లశాఖ అధికారులకు కూడా రాఖీలు కట్టి సోదరీ స్నేహాన్ని పంచుకున్నారు. గంజాయిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని ఆమె స్పష్టం చేశారు.

## క్రెడిట్ కార్డ్ పేమెంట్ ఈఎంఐ గా మార్చుకుంటే వడ్డీ తగ్గుతుందా..? పూర్తి వివరాలు




ఈ కాలంలో ఉద్యోగం ఉన్న ప్రతి ఒక్కరికీ ఒకటి లేదా రెండు క్రెడిట్ కార్డ్స్ ఉండటం సర్వ సాధారణంగా మారిపోయింది. మొదట్లో వద్దంటూనే కార్డ్ తీసుకునే చాలా మంది ఆ తర్వాత అనవసరమైన ఖర్చులతో ఆర్థికంగా క్రమశిక్షణ కోల్పోతుంటారు. కానీ అత్యవసరాల్లో లేదా జాగ్రత్తగా వాడుకునే వ్యక్తులకు క్రెడిట్ కార్డ్ పెద్ద వరం. కార్డును మనం కంట్రోల్ చేస్తే లైఫ్ హ్యాపీ కానీ.. కార్డే మనల్ని కంట్రోల్ చేస్తుంటే మాత్రం కష్టాలు తప్పవు. చాలా మంది కార్డ్ ఉందికదా అని అవసరమైనవి, అనవసరమైనవి అన్నీ కొనేసి తీరా బిల్ వచ్చాక దానిని కట్టలేక ఇబ్బంది పడుతుంటారు. అప్పుడే క్రెడిట్ కార్డ్ కంపెనీలు మీకు కాల్ చేసి సార్ బ్యాలెన్స్ మొత్తాన్ని ఈఎంఐగా మార్చుకోండి అంటూ సూచిస్తుంటాయి. క్రెడిట్ కార్డ్ సంస్థలు ఉచితంగా అందించే గడువు తర్వాత చెల్లించని ఔట్ స్టాండింగ్ మొత్తంపై రోజువారీ లెక్కన వడ్డీ వేస్తుంటాయి. అయితే ఈఎంఐగా దానిని మార్చుకుంటే ఏమైనా బెనిఫిట్ ఉంటుందా అనే విషయం ఇప్పుడు తెలుసుకుందాం.. బిల్లు చెల్లించాల్సిన తేదీని మిస్ అయితే క్రెడిట్ కార్డ్ ఔట్ స్టాండింగ్ మొత్తంపై రోజువారీ చొప్పున వడ్డీని లెక్కిస్తుంది క్రెడిట్ కార్డ్ ఇచ్చిన సంస్థ. ఒక వేళ మీరు చెల్లించాల్సిన మొత్తాన్ని ఈఎంఐ కిందికి మార్చుకున్నా సరే ఇదే విధానాన్ని పాటిస్తుంది కంపెనీ. పైగా మీరు చెల్లించాల్సిన మొత్తాన్ని పెండింగ్ లో ఉంచి కొత్తగా కార్డ్ నుంచి డబ్బు ఖర్చు చేస్తే దీనిపై కూడా రోజువారీ లెక్కన కార్డ్ సంస్థలు వడ్డీని లాగేస్తాయని గుర్తుంచుకోండి. ఈఎంఐ కిందికి మార్చటం ద్వారా కేవలం మీరు దానిని క్రమశిక్షణగా చెల్లించటానికి వీలు కల్పించబడుతుందే తప్ప వడ్డీ విషయంలో మాత్రం ఎలాంటి మార్పులు ఉండవని గుర్తుంచుకోండి. అందుకే క్రెడిట్ కార్డ్ వాడేటప్పుడు దానిని తిరిగి చెల్లించే స్థోమత ఉన్నంత వరకు లిమిట్ వాడటం మంచిది. బిల్లింగ్ సైకిల్ సమయంలో మొత్తం చెల్లించటం మంచిది. మినిమం డ్యూ చెల్లిస్తే కూడా పేమెంట్ చేయని మొత్తానికి కార్డ్ సంస్థలు రోజువారీ చొప్పున వడ్డీని మీ నుంచే వసూలు చేస్తాయని తెలుసుకోండి. పైగా ఇలా చేయటం వల్ల మీ క్రెడిట్ స్కోర్ కూడా దెబ్బతినే ప్రమాదం ఉందని గమనించండి. క్రెడిట్ కార్డ్ సంస్థలు 3 రూపాయల నుంచి 5 రూపాయల మధ్య వడ్డీని వసూలు చేస్తుంటాయి. ఇది పర్సనల్ లోన్ లేదా బయట వడ్డీకి తీసుకోవటం కంటే ఖరీదైనది కాబట్టి ఎట్టిపరిస్థితుల్లోనూ బిల్ సైకిల్ సమయంలో పూర్తి డబ్బు చెల్లించేలా ప్లాన్ చేసుకోవటం మంచి ఆర్థిక అలవాటు.

## వంట బాలేదనే దంపతుల కేసు... హైకోర్టు సంచలన వ్యాఖ్యలు!



వైవాహిక బంధానికి సంబంధించిన కేసుల్లో ఇటీవల ఉన్నత న్యాయస్థానాలు, సర్వోన్నత న్యాయస్థానాలు వెలువరిస్తున్న తీర్పులు ఎంతో ఆసక్తికరంగా ఉంటున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా ముంబై హైకోర్టు ఓ ఆసక్తికరమైన తీర్పు ఇచ్చింది. ఇందులో భాగంగా... వంట బాలేదని, దుస్తులు బాగా ధరించడం లేదని అంటున్నారని భార్య చేసిన ఆరోపణలపై మరింత ఆసక్తికర కామెంట్లు చేసింది.

అవును... తాజాగా ఓ జంటకు సంబంధించిన కేసులో ముంబై ఉన్నత న్యాయస్థానం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. వివరాల్లోకి వెళ్తే... 2022 మార్చిలో ఓ జంటకు వివాహమైంది. అయితే.. ఏడాది తర్వాత ఆమె భర్త నుంచి దూరంగా ఉంటుంది. ఈ క్రమంలో... తనను భర్త, అత్తమామలతో పాటు భర్త తరుపు బంధువులు వేధిస్తున్నారంటూ గృహహింస కేసు పెట్టింది. వివాహం జరిగిన నెల నుంచే తాను అత్తింట్లో వేధింపులు ఎదుర్కొన్నానని.. వంట బాగా చేయడం లేదని, దుస్తులు సరైనవి ధరించడం లేదని భర్త సూటిపోటి మాటలతో వేధించాడని.. అతనికి శారీరక, మానసిక సమస్యలు ఉన్న విషయం దాచారని.. ఇంటి కొనుగోలు కోసం రూ.15 లక్షలు తేవాలని అతని కుటుంబ సభ్యులు, బంధువులు హింసించారని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈ క్రమంలో ఈ పిటిషన్ పై విచారణ జరిపిన ముంబై హైకోర్టు ఔరంగాబాద్ బెంచ్.. శుక్రవారం తీర్పు వెల్లడించింది. ఈ సందర్భంగా.. "దుస్తులు సరిగా వేసుకోలేదని.. వంట సరిగా చేయలేదని తిడుతుంటాడని కొందరు భార్యలు భర్తలపై ఫిర్యాదు చేస్తుంటారు.. అయితే వీటిని మేం తీవ్రమైన క్రూరత్వంగా, వేధింపులుగా పరిగణించలేం" అని జస్టిస్ విభా కంకన్ వాడి, జస్టిస్ సంజయ్ ఏ దేశ్ ముఖ్ లతో కూడిన బెంచ్ స్పష్టం చేసింది. ఈ సందర్భంగా... వివాహానికి ముందు భర్త మానసిక, శారీరక ఆరోగ్య స్థితి గురించి తనకు చెప్పలేదని ఆమె ఆరోపిస్తుంది కానీ... ఇద్దరి మధ్య జరిగిన చాట్ రికార్డులు అసలు విషయాన్ని బయటపెట్టాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇదే క్రమంలో... ఇల్లు కొనుగోలు కోసం డబ్బు కోసం వేధించారని చెబుతోంది కానీ, అప్పటికే అతనికి ఓ ఇల్లు ఉందని.. అలాంటప్పుడ ఇంటి కోసం వేధించాల్సిన అవసరం ఆ భర్తకు ఏముందని ప్రశ్నించింది.

ఇక... వివాహ సంబంధం బలహీనపడినప్పుడే వంట బాగాలేదు, దుస్తులు బాగోలేవనే.. అతిశయోక్తులు జోడించబడతాయని.. ఇలాంటి సందర్భాల్లో కేసులు వేయడం అంటే.. చట్టాన్ని అడ్డుపెట్టకుని భర్త, అతని కుటుంబాన్ని వేధించడమే అవుతుంది అని ద్విసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ క్రమంలోనే భర్తపై నమోదైన ఎఫ్.ఐ.ఆర్.ను కొట్టేస్తున్నట్లు తీర్పు ఇచ్చింది. ఈ సందర్భంగా ఆమెకు ఇది రెండో వివాహం అనే విషయాన్ని ప్రస్థావించిన ధర్మాసనం... 2013లో విడాకులు తీసుకుని, 2022లో మరో వ్యక్తిని వివాహం చేసుకున్న పిటిషనర్... పెళ్లైన నెలకే వైవాహిక జీవితంలో వేధింపులు ఎదుర్కొన్నానని చెబుతుండటం చూస్తుంటే.. ఆమె ఆరోపణలు అతిశయోక్తితో కూడినవని తెలిపింది.

# భూమిపై ఒక్కసారిగా వరదలు ఎలా వస్తాయి.. అసలు భారీ వర్షాలకి కారణం ఏంటి..?

ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశి జిల్లాలోని ధరాలి గ్రామంలో మేఘాల విస్ఫోటనం వల్ల భారీ విధ్వంసం చోటు చేసుకుంది. ఈ ప్రకృతి ప్రళయం చాలా మంది ప్రాణాలు కోల్పోగా, ఎంతో మంది కనిపించకుండా పోయారు. అయితే వర్షాకాలం రాగానే ఒకవైపు మనం సమ్మర్ వేడి రిలీఫ్ అవుతాం. మరోవైపు వరదలు, కొండచరియలు విరిగిపడటం లేదా పిడుగులు పడటం జరుగుతుంటాయి. అయితే క్లౌడ్ బరస్ట్ ఎలా ఏర్పడుతుందో తెలుసా..

క్లౌడ్ బరస్ట్ అనేది సహజంగా ఆకాశంలో ఏర్పడుతుంది, అది కూడా భూమి నుండి దాదాపు 15 కిలోమీటర్ల ఎత్తులో. కాబట్టి సాధారణంగా క్లౌడ్ బరస్ట్ వార్తలు హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూ %డ% కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలలో వినిపిస్తుంటాయి. కొండ ప్రాంతాలలో ఉండే ప్రజలు దాదాపు ప్రతి వర్షాకాలంలో ఇలాంటి విపత్తులను ఎదుర్కోవలసి ఉంటుంది. అసలు మేఘం ఎలా పేలుతుంది, దానికి కారణం ఏంటి అనే ప్రశ్న మీకు ఉండొచ్చు...

ఒకే చోట 20సెం.మీ కంటే ఎక్కువ వర్షం పడితే దానిని క్లౌడ్ బరస్ట్ అంటారు. దీనికి కారణం మేఘాలకు తేమ చేరకపోవడం. తేమ మేఘాలకు చేరనప్పుడు లేదా చేరుకోవడం ఆగిపోయినప్పుడు చల్లని గాలి దానిలోకి ప్రవేశిస్తుంది, తరువాత తెల్లటి మేఘాలు నల్లటి మేఘాలుగా మారి ఉరుములతో భారీ వర్షం కురుస్తాయి.

వేడి గాలి పైకి: వాతావరణంలో తేమ, వేడి స్థాయి పెరిగినప్పుడు మేఘాల విస్ఫోటనం జరుగుతుంది. ఇలా కొండ ప్రాంతాలలో ఎక్కువగా సంభవిస్తుంది. మేఘాల విస్ఫోటనం



ప్రక్రియ సైన్స్ కి సంబంధించినది. వేడి గాలులు మేఘాన్ని పైకి తీసుకెళ్లినప్పుడు, పైన ఉన్న మేఘం చల్లని గాలిని తాకుతుంది. ఈ మేఘం తేమతో నిండి ఉంటుంది, చల్లని గాలిని తాకినప్పుడు మేఘంలో పేరుకుపోయిన తేమ లేదా నీటి ఆవిరి వేగంగా నీటి బిందువులుగా మారుతుంది తరువాత భారీ వర్షం కురుస్తుంది. కొండ ప్రాంతాలలో గాలి వేగంగా పైకి వీస్తుంది, ఇది మేఘాలను ఏర్పరుస్తుంది ఇంకా చల్లని గాలితో వర్షం పడుతుంది. వర్షాకాలంలో, తక్కువ వాయు పీడనం ఉన్న ప్రాంతాలలో వేడి, తేమతో కూడిన గాలి వేగంగా పెరుగుతుంది, ఇది మేఘాలు విస్ఫోటనం చెందే అవకాశాలను పెంచుతుంది. చల్లని ఇంకా వేడి గాలులు ఒకదానికొకటి ఢీకొంటే, మేఘాలు కూడా విస్ఫోటనం చెందుతాయి.

క్యుములోనింబస్ మేఘాలు: వరదలకు కారణమయ్యే మేఘాలను క్యుములోనింబస్ మేఘాలు అంటారు. ఎందుకంటే అవి భారీ వర్షాలకు కారణమవుతాయి. మేఘాలు విస్ఫోటనం చెందే ప్రక్రియలో చిన్న నీటి బిందువులు ఒకదానికొకటి ఢీకొని భారీ రూపాన్ని సంతరించుకుంటాయి. ఈ ప్రక్రియను లాంగ్మయిర్ అవపాతం అంటారు. ఇందులో, పెద్ద వర్షపు బిందువులు చిన్న బిందువులతో కలిసి వేగంగా కిందకు వస్తాయి.

## రాఖీ పండగకు ఊరెళ్లారా..? ఈ జిల్లాల్లో భారీ వర్షాలకు ఛాన్స్.. జర జాగ్రత్త




రాఖీ పండగకు నగరాలు, పట్టణాల నుంచి సొంతూళ్లకు వెళ్లిన పబ్లిక్ వర్షాకాలం కావడంతో వాతావరణాన్ని కూడా ఓ కంట కనిపెట్టుకుంటూ ఉండటం మంచిది. నేడు, రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈశాన్య బంగాళాఖాతం వరకు రుతుపవన ద్రోణి కొనసాగుతుందని పేర్కొంది.

దక్షిణ కోస్తాంధ్ర తీరంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడింది. ఈ ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. పలు జిల్లాలకు భారీ వర్షాలు చెప్పిన వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈరోజు అదిలాబాద్, నిర్మల్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, జగిత్యాల, మంచిర్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట, రంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నారాయణ్ పేట్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, హన్మకొండ, మహబూబాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మిగతా అన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ వాతావరణ పరిస్థితులను అనుసరించి ప్రయాణాలను ప్లాన్ చేసుకోవడం బెటర్. లేకపోతే.. భారీ వర్షంలో చిక్కుకుని ట్రాఫిక్?తో నరకం చూడటం ఖాయం.

# పండగ ప్రయాణాలకు 20% డిస్కౌంట్.. కొత్త రౌండ్ ట్రిప్ ప్యాకేజ్ తెచ్చిన భారతీయ రైల్వేస్

దేశంలో ప్రజలు ఎక్కువగా వినియోగించే ప్రయాణ సౌకర్యం రైలు. ఎక్కువ దూరం ప్రయాణాలకు దీనిని విరివిగా భారతీయులు వినియోగిస్తుంటారు. పండుగల సమయాల్లో రద్దీని తగ్గించటంతో పాటు టిక్కె బుక్కింగ్స్ సులభతరం చేసేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ కొత్త ఆలోచనలతో ముందుకొచ్చింది. తాజాగా పండుగల సమయాల్లో ప్రయాణం కోసం రౌండ్ ట్రిప్ ప్యాకేజీని పైలట్ ప్రాజెక్ట్ స్టార్ట్ చేస్తున్నట్లు వెల్లడించింది. ఇది ప్రయాణికులకు డిస్కౌంట్లను అందిస్తుంది. పైగా ప్రయాణికుల రద్దీని విస్తరించేందుకు, రైళ్ల ఆక్యుపెన్సీని పెంచటానికి ఇది దోహదపడుతుందని రైల్వే శాఖ భావిస్తోంది. స్కీమ్ కింద ప్రయాణికులు నిర్ధేశించిన కాలానికి ముందు తిరుగు ప్రయాణానికి టిక్కెట్ బుక్ చేసుకున్నట్లయితే వారికి 20 శాతం బేస్ ఫేర్ రాయితీ అందిచబడనుంది.

డిస్కౌంట్ పొందాలంటే ఒక్కడే ప్రయాణికులు తన ప్రయాణంతో పాటు తిరుగు ప్రయాణానికి కూడా టిక్కెట్ బుక్కింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. అంటే పాసింజర్ డిజైల్స్ రెండు ప్రయాణాల్లోనూ మ్యాచ్ కావాల్సిందే. స్కీమ్ అన్ని తరగతులు అలాగే అన్ని రైళ్లకు వర్తించనుంది. స్పెషల్ రైళ్లకు కూడా ఇదే రూల్స్ వర్తిస్తాయి. అలాగే బుక్కింగ్ ఒకే విధానంలో పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది.

టిక్కెట్ బుక్కింగ్స్ ఆగస్టు 14 నుంచి ప్రారంభం అవుతాయి.




అక్టోబర్ 13 నుంచి 26 వరకు రైళ్లకు ప్రయాణ టిక్కెట్లు బుక్ చేసుకునేందుకు వీలుంటుంది. వీటికి రిటర్న్ టిక్కెట్ల బుర్కింగ్ నవంబర్ 17 నుంచి డిసెంబర్ 1 వరకు అనుమతించబడుతుంది. కనెక్టింగ్ జర్నీ సదుపాయం ద్వారా రిటర్న్ టిక్కెట్లను బుక్ చేసుకోవాలి.

రిటర్న్ టిక్కెట్లకు అడ్వాన్స్ రిజర్వేషన్ గడువు వర్తించదు. కేవలం రిటర్న్ టిక్కెట్లపై మాత్రమే బేస్ ఫేర్ మీద 20 శాతం తగ్గింపుకు అర్హత ఉంటుంది. వెళ్లేటప్పుడు ఏ క్లాస్ టిక్కెట్ ఎక్కడి నుంచి ఎక్కడికి కొన్నారో వచ్చేటప్పుడు కూడా అవే సెలెక్ట్ చేసుకోవాలి. ఈ స్కీమ్ కింద ఎలాంటి రీఫండ్ అందించబడదు.

## రాఖీ పండుగ ఎఫెక్ట్.. ట్రాఫిక్‌తో స్తంభించిన హైదరాబాద్.. సిటీ దాటేందుకు 2 గంటల పైనే..




రాఖీ పండుగ సందర్భంగా హైదరాబాద్ రోడ్లన్నీ వాహనాలతో కళకళలాడుతున్నాయి. సిటీ నుంచి జిల్లాలకు వెళ్లే రూట్లు.. నగరానికి వచ్చే రూట్లు.. ఇలా ఎటు చూసినా చీమల బారులు తీరినట్లుగా వెహికిల్స్ రద్దీతో హైవేలన్నీ నిండిపోయాయి. దీంతో అన్ని దారులలో భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. హైదరాబాద్ నగరాన్ని దాటి ఓఆర్ఆర్ వెళ్లడానికి కనీసం రెండు గంటల సమయం పడుతుండటంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వారం రోజుల పాటు ఉద్యోగాలు, పనులతో బిజీబిజీగా ఉండే హైదరాబాద్ జనాలు.. వీకెండ్ కావడం.. రాఖీ పండుగ రావడంతో సొంతూళ్లకు వెళు_న్నారు. తోడబుట్టిన అన్నా తమ్ముళ్లకు రాఖీ కట్టేందుకు క్యూకట్టారు. మరోవైపు సిటీలో ఉన్న వాళ్లకోసం ఊళ్ల నుంచి హైదరాబాద్ చేరుకునే వారి సంఖ్య కూడా ఎక్కువగా ఉండటం.. నగరంలో పలు ఏరియాలో ఉన్న వారిని కలుసుకునేందుకు భారీగా జనాలు వెళ్తుండటంతో ఆటోలు, బస్ లు, చివరికి మెట్రో స్టేషన్లలో కూడా జనాలు కిక్కిరిసిపోయారు. రాఖీ పండగ వేళ హైద్రాబాద్ టు విజయవాడ హైవే వాహనాలతో కిక్కిరిసిపోయింది. ప్రజలు పండగకు సొంతూళ్లకు వెళ్తుండటంతో RTC బస్సులు, ప్రైవేటు వెహికల్స్ భారీగా బారులుతీరాయి. LBనగర్ నుంచి వనస్థలీపురం, హయతనగర్, అబ్దుల్లాపూర్మెట్ వరకు వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ఇటు వరంగల్ హైవేపైన కూడా భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. మరోవైపు కరీంనగర్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్,మంచిర్యాల,సిద్ధిపేట వెళ్ళే వాహనాలు ట్రాఫిక్ జామ్ బొల్లారం రోడ్డు పై దాదాపు 4 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ నిలిచిపోయింది. కూకట్ పల్లి, ముంబై జాతీయ రహదారి వెంట.. మియాపూర్ బాచుపల్లి అన్నీ ఏరియాల్లో భారీగా ట్రాఫిక్ జాం అయినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ రూట్ లో 3కిలోమీటర్ల జర్నీకి 2గంటల పైగా సమయం పడుతోంది. మరోవైపు సికింద్రాబాద్ బొల్లారం రోడ్డుపై దాదాపు 5 కిలోమీటర్ల వాహనాలు నిలిచిపోయాయి. JBS నుండి ORR వెళ్ళడానికి 2 గంటల సమయం పడుతుందని చెబుతున్నారు.

CK NEWS చంద్రకాంత్ తెలుగు దినపత్రిక

## ప్రయాణ విరేచనాలతో పేగుపూత

విహార యాత్రలు, పర్యటనలు ఆహ్లాదం, మానసికోల్లాసం కలిగిస్తాయనటంలో సందేహం లేదు. కానీ ఆహారం విషయంలో జాగ్రత్తగా లేకపోతే విరేచనాలు పట్టుకోవచ్చు. ఇది పర్యటన ఆనందాన్ని దెబ్బతీయటమే కాదు.. కొన్నిసార్లు పేగుపూత (ఐబీఎస్) సమస్యనూ ప్రేరేపించొచ్చు. ఈ దీర్ఘకాల సమస్య ఇంటికి వచ్చిన తర్వాతా నెలలు.. చివరికి ఏళ్ల కొద్దీ వెంటాడుతూ రావొచ్చు. ఆశ్చర్యకరంగా అనిపించినా ఇలాంటి సమస్య తలెత్తే అవకాశముందని తెలుసుకోవటం చాలా ముఖ్యం.

ప్రయాణ సమయంలో విరేచనాల బారినపడ్డవారిలో ప్రతి 8 మందిలో ఒకరికి కనీసం ఆరు నెలల వరకూ దీని లక్షణాలు కొనసాగుతూ వస్తున్నట్టు ఒక అధ్యయనం పేర్కొంటోంది. అంతేనా? వీరిలో 80% మందిలో కనీసం ఏడాది వరకూ ఇబ్బంది పడుతున్నారు. పేగుపూత గలవారిలో విరేచనాలు లేదా మలబద్ధకం కనిపిస్తుంటారు. కొందరిలో రెండూ ఉండొచ్చు. అలాగే కడుపు నొప్పి, పొట్ట ఉబ్బరంతోనూ ఇబ్బంది పడుతుంటారు. ప్రయాణ అనంతరం తలెత్తే ఐబీఎస్‌ను ఇన్‌ఫెక్షన్ అనంతర ఐబీఎస్ (పీఐ-ఐబీఎస్) అంటారు. కొందరికిది జీవితాంత సమస్యగానూ మారొచ్చు. సుమారు 25% నుంచి 30% మందిలో పదేళ్ల తర్వాతా లక్షణాలు వేధిస్తుండటం గమనార్హం.

ఎందుకీ సమస్య?

ప్రయాణ అనంతర ఐబీఎస్‌కు మూలం బ్యాక్టీరియా, వైరస్ లేదా పరాన్నజీవుల ఇన్‌ఫెక్షన్లు. సాధారణంగా కలుషిత ఆహారం లేదా నీటిలోని క్యాంపైలోబ్యాక్టర్, ఇ.కొలి వంటి సూక్ష్మక్రిముల ద్వారా ఇవి సంక్రమిస్తాయి. ఈ ఇన్‌ఫెక్షన్లు తగ్గినా కూడా లక్షణాలు విడవకుండా వేధిస్తుంటే ప్రయాణ అనంతర ఐబీఎస్‌గా భావిస్తారు. ఇది ఎందుకు ప్రేరేపితమవుందనే దానిపై రకరకాల సిద్ధాంతాలు ఉన్నాయి. రోగనిరోధక వ్యవస్థ పొరపాటున ఒక ప్రొటీన్‌ను హానికరమైందని భావించి, దానిపై దాడి చేయటం కారణం కావొచ్చని ఒకటి చెబుతుంది. ప్రయాణ విరేచనాలతో ముడిపడిన షిగెల్లా, క్యాంపైలోబ్యాక్టర్, సాల్మొనెల్లా, ఇ.కొలి వంటి బ్యాక్టీరియా ఒక విషతుల్య పదార్థాన్ని విడుదల చేస్తాయి. ఇది పేగుల్లో ఉండే విన్‌క్యులిన్ అనే ప్రొటీన్‌ను పోలి ఉంటుంది ఈ ప్రొటీన్ పేగుల ఆరోగ్యానికి చాలా ముఖ్యం. అయితే రోగనిరోధక వ్యవస్థ విషతుల్య పదార్థాన్ని, విన్‌క్యులిన్‌ను పోల్చుకోవటంలో పొరపడొచ్చు. ఇది విడుదల చేసే యాంటీబాడీలు పొరపాటున విన్‌క్యులిన్ మీదా దాడి చేస్తాయి. దీంతో పేగుల పనితీరు దెబ్బతింటుంది. కొన్నిరకాల బ్యాక్టీరియా ఎక్కువగా వృద్ధి చెందుతుంది. ఇది ఐబీఎస్‌కు దారితీస్తుంది. ఈ సమస్య గల 56% మందిలో విన్‌క్యులిన్ యాంటీబాడీలు ఉంటున్నట్టు ఒక అధ్యయనంలో తేలింది. జియార్డియా వంటి పరాన్నజీవులతోనూ ప్రయాణ కాల విరేచనాలు పట్టుకోవచ్చు. పీఐ-ఐబీఎస్‌కు జియార్డియా ఎక్కువగా కారణమవుతుంది కూడా. అయితే ఇదేమీ విషతుల్యాలను విడుదల చేయదు. అంటే పేగుపూత సమస్యకు మరేదో దోహదం చేస్తోందన్నమాట. దీనికి కారణం పేగు బ్యాక్టీరియా అస్తవ్యస్తం కావొచ్చని భావిస్తున్నారు. ప్రయాణ కాల విరేచనాలతో మంచి, చెడు బ్యాక్టీరియా మధ్య సమతుల్యత దెబ్బతింటుంది. మంచి బ్యాక్టీరియా వాపు నివారణ గుణాలు కలిగుంటాయి. పేగుల నుంచి రక్తంలోకి హానికారకాలు చేరకుండా నియంత్రిస్తాయి కూడా. ఒకవేళ చెడు బ్యాక్టీరియా ఎక్కువగా వృద్ధి చెందినట్టయితే దీర్ఘకాల వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) ప్రేరేపితమవుతుంది. ఇది మల విసర్జన తీరులో మార్పులకు దోహదం చేస్తుంది. చివరికి పేగుపూత లక్షణాలకు కారణమవుతుంది.

**ముప్పు ఎవరికి?**

చాలామంది ప్రయాణాలు చేస్తుంటారు. చాలామందికి విరేచనాలు పట్టుకోవచ్చు. అలాగని అందరికీ ఇవి పేగుపూతకు దారితీయవు. కొందరికే ఈ సమస్య ఎందుకు వస్తుందనేది కచ్చితంగా తెలియదు. ఇది ఆడవారిలో, పిల్లల్లో ఎక్కువ. కొందరిలో జన్యువులూ దీనికి కారణం కావొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. కలుషితాహారంతో తీవ్రంగా విరేచనాలు పట్టుకున్నవారికి దీని ముప్పు ఎక్కువని చెబుతున్నారు. అప్పటికే ప్రయాణ అనంతర ఐబీఎస్ గలవారికి మరోసారి వచ్చే అవకాశమూ ఎక్కువగానే ఉంటుంది. వీరిలో లక్షణాలు మరింత తీవ్రంగానూ ఉండొచ్చు.

ప్రయాణాల సమయంలో విరేచనాలు పట్టుకోకుండా చూసుకోవటం చాలా ముఖ్యం. ఆహారం, నీరు ఎక్కువగా కలుషితమయ్యే చోట్లకు వెళ్లినప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి.

పాశ్చరైజ్ చేయని పాలు, పాల పదార్థాలు.. పచ్చి ఆహార పదార్థాలు తినొద్దు. మాంసం, చేపలు, గుడ్ల వంటివి పూర్తిగా ఉడికించిన తర్వాతే తినాలి.

అపరిశుభ్రంగా ఉండే హొటళ్లు, వీధి బండ్ల వద్ద ఆహార పదార్థాలు తినొద్దు, పానీయాలు తాగొద్దు.

భోజనం చేసే ముందు, మల విసర్జన తర్వాత సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలి.

ఒక మాదిరి విరేచనాలకు యాంటీబయాటిక్ మందులు వాడటం తగదనీ గుర్తుంచుకోవాలి. ఇవి పేగు బ్యాక్టీరియాను అస్తవ్యస్తం చేయటం వల్ల లక్షణాలు మరింత తీవ్రమవుతాయి. విరేచనాలు బాగా తీవ్రంగా ఉంటే యాంటీబయాటిక్స్ అవసరమవుతాయి. అదీ డాక్టర్ సలహాతోనే తీసుకోవాలి.

# ఇంట్లో మొక్కలు పెంచితే..
# బోలెడన్ని ప్రయోజనాలు

### గాలిని శుభ్రం చేసే శక్తి మొక్కలకు ఉంది
### వీటి నుంచి అదే పనిగా స్వచ్ఛమైన ఆక్సిజన్ విడుదల
### ఒత్తిడి, ఆందోళన నుంచి ఉపశమనం
### ఇంటి మొక్కలతో నాణ్యమైన నిద్ర, ఆరోగ్యం



కొందరు ఇంట్లో కొంచెం ఖాళీ స్థలం ఉన్నా దాన్ని మొక్కలతో నింపేస్తారు. పూల కుండీల్లో తమకు నచ్చిన మొక్కలను పెంచుకుంటూ, ప్రాణంగా చూసుకుంటారు. మొక్కలపై, పర్యావరణంపై ప్రేమతోనే అనుకోకండి. మొక్కలను పెంచడం వల్ల అదనంగా మనకూ ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఈ మధ్య సోషల్ మీడియాలో ఒక అంశం తెగ ట్రెండింగ్ అయింది. కూలర్ లో నీళ్లు పోస్తున్న ఫొటోను పెట్టి.. 'మొక్కలకు నీళ్లు పోస్తే ఈ అవస్థ తప్పేదిగా' అంటూ క్యాప్షన్ పెట్టారు. ఇది చాలా మందిని ఆలోచింపచేసింది. ఇందులో నిజంగా ఎంతో అర్థం ఉండడంతో తెగ షేర్ కూడా అయింది. అవును నిజమే, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటికి నీళ్లు పోసి, అవి చెట్లుగా మారితే బతికి ఉన్నంత కాలం అవి మనకు నీడను ఇవ్వడమే కాదు. ఎంతో కాలుష్యాన్ని తగ్గిస్తాయి. వేడి నుంచి ఉపశమనాన్ని, పర్యావరణ కాలుష్యం నుంచి రక్షణనిచ్చే చెట్లకు ప్రాధాన్యం ఇవ్వడం చాలా అవసరం.

**వాయు నాణ్యత**

ఇంట్లో ఎయిర్ ప్యూరిఫయర్ అవసరం నేడు ఎంతో ఉంది. దీనికి కారణం వాయు, పారిశ్రామిక కాలుష్యం అధికం కావడమే. ఇంట్లో ఒక ప్యూరిఫయర్ ఉంటే ఎంత మేలు చేస్తుందో తెలియదు కానీ, ఒక్క చెట్టు ఉంటే అంతకంటే ఎక్కువ మేలు చేస్తుందని చెప్పొచ్చు. మొక్కలు సహజంగానే గాలిని ఫిల్టర్ చేసే సాధనాలు. గాల్లోంచి హాని కారకాలను తొలగిస్తాయి. ఇంట్లోని కుండీల్లో పెంచుకునే స్పైడర్ ప్లాంట్స్, పీస్ లిల్లీస్ తదితర మొక్కలు హానికారక టాక్సిన్లను తొలగిస్తాయి. ఇంట్లో గాలి నాణ్యతను పెంచుతాయి.

**ఒత్తిడి, ఆందోళన నుంచి ఉపశమనం**

ఇంట్లో మొక్కలతో మరో ప్రయోజనం మనలో ఒత్తిడి తగ్గుతుంది. ఆందోళన కూడా ఉపశమిస్తుంది. ఎందుకంటే మొక్కల నుంచి స్వచ్ఛమైన ఆక్సిజన్ విడుదల అవుతుంది. అది మనసుకు ఉల్లాసాన్నిస్తుంది. మొక్కలు చుట్టూ ఉంటే మరింత సమర్థవంతంగా పనిచేస్తారని, జ్ఞాపకశక్తికి చురుగ్గా మారుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. మెదడుపై మొక్కలు చూపించే సానుకుల ఫలితాలే దీనికి కారణం.

**వ్యాధి నిరోధక శక్తి**

ఇంట్లో పెంచుకునే మొక్కలతో వ్యాధి నిరోధక శక్తి బలపడుతుందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది. మొక్కలు ఫైటోసైడ్స్ ను విడుదల చేస్తాయి. బ్యాక్టీరియా, వైరస్ పై పోరాడడంలో సాయపడే సహజ రసాయనం ఫైటోసైడ్స్.

**నాణ్యమైన నిద్ర**

మొక్కలు మన నిద్ర నాణ్యతను కూడా పెంచుతాయి. ఎందుకంటే మొక్కల నుంచి మనకు చక్కని ఆక్సిజన్ అందడం వల్ల నిద్ర నాణ్యత మెరుగు పడుతుంది. ఒత్తిళ్లు కూడా తగ్గుతాయి. కనుక మంచి నిద్ర సాధ్యపడుతుంది.

# రోజువారీ ఇవి అందేలా చూసుకుంటే..
# జుట్టు రాలడాన్ని నివారించవచ్చు!

### శిరోజాలకు పోషకాల అవసరం ఎంతో
### బయోటిన్, విటమిన్ ఈ, సీ, ఏ అందేలా చూసుకోవాలి
### ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ తోనూ ప్రయోజనం



శిరోజాలు రాలిపోవడం వెనుక ఎన్నో కారణాలు ఉంటాయి. పోషకాలు లోపించొచ్చు. లేదంటే ఒత్తిడి, ఆందోళన కారణం కావచ్చు. హార్మోన్లలో మార్పులతోనూ శిరోజాలు రాలిపోయే సమస్య ఎదురవుతుంది. అయితే కారణాన్ని గుర్తిస్తే ఈ సమస్యను సులభంగానే నయం చేసుకోవచ్చు. నివారించలేని సమస్య ఇది కానే కాదు. ముఖ్యంగా శిరోజాలకు బలాన్నిచ్చే ముఖ్యమైన పోషకాలు కొన్ని ఉన్నాయి. వీటిని రోజువారీ ఆహారం రూపంలో అందేలా చూసుకోవాలి.

**బయోటిన్**

ఇది బీ 7 విటమిన్. ఇది లోపించడం వల్ల శిరోజాలకు బలం తగ్గుతుంది. బయోటిన్ లోపించినప్పుడు జుట్టు కుదుళ్లకు సరిపడా ఆక్సిజన్ సరఫరా కాదు. దీంతో జుట్టు కుదుళ్లు బలహీనపడతాయి. దాంతో జుట్టు రాలుతుంది. 18 ఏళ్లు నిండిన వారు ప్రతి రోజూ 30 ఎంసీజీ నుంచి 100 ఎంసీజీ వరకు బయోటిన్ అందేలా చూసుకోవాలి. బయోటిన్ కొంచెం ఎక్కువైనా మూత్రం ద్వారా విసర్జితం అవుతుంది.

**విటమిన్ ఏ**

సాధారణంగా విటమిన్ ఏ అంటే కంటి ఆరోగ్యానికే అనుకుంటుంటాం. కానీ, ఇది శిరోజాల ఎదుగుదలకూ ముఖ్యమే. విటమిన్ ఏ ఎక్కువైనా ప్రమాదమే. అందుకని రోజులో 900 ఎంసీజీ పరిమాణం మించకుండా విటమిమన్ ఏ తీసుకోవచ్చు. ఎక్కువ తీసుకుంటే అదనపు మొత్తాన్ని మన శరీరం మూత్రం ద్వారా బయటకు పంపలేదు. శరీరంలోనే నిల్వ చేసుకుంటుంది. కనుక మోతాదు మించకూడదు.

**ఐరన్**

మన శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్ ను ఎర్ర రక్త కణాలు చేరవేస్తాయి. అప్పుడు జీవక్రియలు సాఫీగా నడుస్తాయి. కనుక ప్రతి ఒక్కరూ ఐరన్ లోపం లేకుండా చూసుకోవాలి. ఐరన్ లోపిస్తే జుట్టు కూడా రాలిపోతుంది. రోజులో పెద్దవారు గరిష్ఠంగా 45 ఎంజీ మించకుండా ఐరన్ అందేలా చూసుకోవాలి.

**ఒమెగా 3**

ఇవి మంచి కొవ్వులు. జుట్టు ఎదిగేందుకు సైతం ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉపయోగపడుతాయి. జుట్టు రాలిపోతున్న వారికి ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్, 6 యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్లను ఇచ్చి చూసినప్పుడు మంచి ఫలితాలు కనిపించాయి.

**విటమిన్ డీ**

విటమిన్ డీ లోపం అలోపీసియాకు దారితీస్తుంది. అంటే మహిళల్లో బట్టతలను ఇలా చెబుతారు. వెంట్రుకలకు సంబంధించి కొత్త ఫాలికల్స్ ఏర్పడడంలో విటమిన్ డీ ప్రభావం ఉంటుందని ఓ అధ్యయనంలో వెల్లడైంది. పెద్దలు రోజువారీ 600 ఐయూల మేరకు విటమిన్ డీ అందేలా చూసుకోవాలి.

**విటమిన్ ఈ**

విటమిన్ ఈ కూడా జుట్టు ఆరోగ్యంగా ఎదిగేందుకు అవసరం. ఇది లోపించినా జుట్టు రాలిపోవచ్చని పలు అధ్యయనాలు వెల్లడించాయి. రోజువారీగా 3-4 ఎంజీ మేర తీసుకోవచ్చు.

**విటమిన్ సీ**

వ్యాధి నిరోధక శక్తిని విటమిన్ సీ పెంచుతుంది. చర్మం, శిరోజాల ఆరోగ్యానికి కారణమయ్యే కొల్లాజెన్ ను పెంచుతుంది. రోజులో 50-75 ఎంజీ మధ్య విటమిన్ సీని ఆహారం ద్వారా అందేలా చూసుకోవాలి. పోషకాల లోపం లేకుండా జాగ్రత్త పడిన తర్వాత కూడా జుట్టు రాలే సమస్య తగ్గకపోతే.. అప్పుడు వైద్యుల సలహా అవసరపడుతుంది.



**మీనాక్షి చౌదరి ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రశాంతమైన మరియు అందమైన రూపాన్ని పంచుకున్నారు**

# దేవర 2 ఇంకెప్పుడు?.. ఆ 9 నెలల గ్యాప్ లో కానిచ్చేస్తారా?



మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయన ఇటీవల వార్ 2 సినిమా పూర్తి చేసుకున్నారు. హృతిక్ రోషన్ తో కలిసి ఎన్టీఆర్ లీడ్ రోల్ లో నటించిన ఈ సినిమా ఆగస్టు 14న విడుదల కానుంది. ఈ క్రమంలో త్వరలోనే ఎన్టీఆర్ ఈ సినిమా ప్రమోషన్స్ లో పాల్గొంటారు. ఈ సినిమా రిలీజ్ తర్వాత తారక్ మళ్లీ ఫుల్ టైమ్ వర్క్ మోడ్ లోకి వెళ్లిపోతారు. ఆయన ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న ఎన్టీఆర్ నీల్ ప్రాజెక్ట్ షూటింగ్ లో పాల్గొంటారు.ఈ సినిమా 2026 జూన్లో విడుదల కానున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. అందుకే ఎన్టీఆర్ వరుస షెడ్యూళ్లలో ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేస్తారు. వచ్చే ఏడాది ప్రారంభంలోనే ఇది పూర్తి చేస్తారని అంటున్నారు. ఈ సినిమా తర్వాత త్రివిక్రమ్ ప్రాజెక్ట్ లైన్ లో ఉంది. త్రివిక్రమ్ దర్శకత్వం వహించనున్న భారీ బడ్జెట్ పౌరాణిక సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు ప్రారంభమయ్యాయి. ఇది 2026 ద్వితీయార్థంలో ప్రారంభం కానుంది. ఇవే కాకుండా జైలర్ ఫేమ్ నెల్సన్ దిలీప్ తోనూ ఎన్టీఆర్ సినిమా చేయనున్నారు. అయితే ఈ ప్రాజెక్ట్ ఎప్పుడు ప్రారంభమవుతుందో కచ్చితంగా తెలీదు. అయితే వీటితోపాటు ఆయన దేవర 2 కూడా చేయాల్సి ఉంది. గతేడాది దేవర తొలి పార్ట్ తో మంచి విజయం అందుకున్న ఎన్టీఆర్- కొరటాల శివ రెండో భాగాన్ని తెరకెక్కించాల్సి ఉంది.దేవర సీక్వెల్ ఖచ్చితంగా ఉంటుందని ఆ మధ్య ఎన్టీఆర్ ప్రకటించారు. ఈ సీక్వెల్ కోసం అటు కొరటాల శివ కూడా స్క్రిప్ట్‌ను పూర్తి చేసి ఎన్టీఆర్ కోసం ఎదురు చూస్తున్నారు. కానీ ఇది ఎప్పుడు ప్రారంభమవుతుందో ఖచ్చితంగా చెప్పలేని పరిస్థితి ఉంది. వరుస ప్రాజెక్టులు లైన్ లో ఉండటంతో కొరటాల శివకు ఎన్టీఆర్ ఎప్పుడు డేట్స్ ఇస్తారో అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

అయితే త్రివిక్రమ్ సినిమా ఆలస్యం అయితే, దేవర 2 సినిమా షూటింగ్ పూర్తి చేయడానికి ఎన్టీఆర్ కు వచ్చే ఏడాది తగినంత సమయం ఉంటుంది. ఇప్పుడు త్రివిక్రమ్- వెంకటేష్ తో ఫ్యామిలీ ఎంటర్టైనర్ తెరకెక్కించనున్నారు. ఈ సినిమాను త్వరగా పూర్చి చేసి 2026 వేసవిలో విడుదలకు చేయాలని ప్లాన్ చేస్తున్నారు. దీని తర్వాత, త్రివిక్రమ్ - ఎన్టీఆర్ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులపై దృష్టి పెట్టాల్సి ఉంది. ఈ మధ్యలో దేవర 2 సినిమా కోసం తారక్ కు దాదాపు తొమ్మిది నెలల సమయం లభిస్తుంది. ఈ గ్యాప్ లో దేవర 2 కంప్లీట్ చేయాలని సన్నాహాలు చేస్తున్నారని ఇన్ సైడ్ టాక్ వినిపిస్తోంది.



**ఇషితా రాజ్ తాజా బ్లాక్ డ్రెస్ ఫోటోషూట్‌లో తలపడింది**



# మొత్తానికి రాజా జనాలకి అలవాటు చేసేసాడలా!

ఒకే పని పదే పదే చేస్తే అలవాటుగా మారుతుంది. తలెత్తిన నెగిటివిటీ కూడా తొలగిపోతుంది. దాని గురించి మళ్లీ ఎక్కడా చర్చకు దారి తీయదు. ఎందుకంటే అప్పటికే అలవాటుగా మారిపోతుంది కాబట్టి. ఇప్పు డదే జరిగింది మాస్ రాజా రవితేజ విషయంలో? ఇంతకీ ఏంటా నెగిటివిటీ? అంతగా చేయకూడని పనేం చేసాడు? అంటే వివరాల్లోకి వెళ్లాల్సిందే. ఏ హీరోకైనా హీరోయిన్ ఎంపికన్నది సమతూకంగా ఉండాలి. 50 ఏళ్ల నటుడైతే 30 ఏళ్ల వయసున్న నాయిక అయితే బ్యాలెన్స్ అవుతుంది. 60 దాటిందంటే కనీసం 40 ఏళ్లు అయినా ఆ హీరోయిన్ కి ఉండాలి.

**వయసుతో పనేంటి?**

కానీ ఇది అన్ని వేళలా సాధ్యపడదు. కొన్ని సందర్భాల్లో 20-25 ఏళ్ల నాయికను ఎంపిక చేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో ఆ వయసు 18 ఏళ్లకు కూడా వెళ్లిపోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో మేకర్స్ ఊహతో సంబంధం లేకుండా సోషల్ మీడియాలో తీవ్ర స్థాయిలో నెగిటివిటీ వ్యక్తమవుతుంది. ఆ మధ్య మాస్ రాజా రవితేజ హీరోగా నటించిన %-%ధమాకా%-% సినిమాలో శ్రీలీల హీరోయిన్ గా నటించిన సంగతి తెలిసిందే. అప్పటికే రవితేజ వయసు 55 ఏళ్లు కాగా శ్రీలీల కు 22 ఏళ్లు. దీంతో తండ్రి వయసున్న రవితేజతో శ్రీలీల రొమాన్స్ చేస్తుం దా? అంటూ సోషల్ మీడియాలో పెద్ద దుమారమే లేచింది.

**ఇప్పుడా సంగతి అంతటా లైట్**

ఇక్కడ టార్గెట్ అయింది రవితేజ. పుండు మీద కారం చల్లినట్లు పదే పదే ఆ కామెంట్ ని తెరపైకి తెచ్చారు సెక్షన్ ఆడియన్స్. కానీ మాస్ రాజా ఆ విమర్శల్ని ఎంత మాత్రం పట్టించుకోలేదు. మీ పని మీది నా పని నాది అన్న తీరులో ముందుకెళ్లాడు. తాజాగా అదే కాంబినేషన్ లో మళ్లీ %-%మాస్ జాతర%-% తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. అప్పటికీ ఇప్పటికీ ఇద్దరి వయసులు రెండేళ్లు మాత్రమే పెరిగాయి. ఇప్పుడెలాంటి కామెంట్లు రాలేదు. విమర్శలు వ్యక్తమవ్వలేదు. సోషల్ మీడియా జనాలు ఆ అంశాన్నే మరిచారు.

**ఆ హీరోకి తప్పలేదు తిప్పలు**

రవితేజ కూడా ఎలాంటి కామెంట్లను పట్టించుకునే రకం కాదు. తన పని తప్ప ఇంకెలాంటి నెగివిటీని తీసుకోని స్వభావం గలవారు. ఏదైనా పాత బడే కొద్ది దాన్ని మర్చిపోవడం అన్నది పరిపాటే. ఇలాంటి వ్యతిరేకతనే రణవీర్ సింగ్ కూడా ఈ మధ్యనే ఎదుర్కున్నారు. %-%దురంధర్%-% లో రణవీర్ కు జోడీగా సారా అర్జున్ నటిస్తోంది. సారా వయసు 20 ఏళ్లు కాగా రణవీర్ సింగ్ ఏజ్ 40 ఏళ్లు. ఇద్దరి మధ్య 20 ఏళ్ల వ్యత్యాసం ఉండటంతో సోషల్ మీడియాలో వ్యతిరేకత వ్యక్తమైంది. జనాలంతా రణవీర్ ని దుమ్మెత్తి పోసారు. బాలీ వుడ్ మీడియాలో ప్రత్యేక కథనాలు వైరల్ అయిన సంగతి తెలిసిందే.